సువర్ణ భారాతి గ్రంథమాలా - 1

# వందే లోకగురుం

జగద్గురు శంకరచార్య శ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామికరకమలసంజాత

జగద్గురు శ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామివారి అనుగ్రహ సందేశము

WWW.SRINGERI.NET

శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానము

దక్షిణామ్నాయ శ్రీశారదాపీఠము, శృంగేరి

**Vande Lokagurum** - *Anugraha Sandesha delivered in Sanskrit by Jagadguru Sri Sri Sri Vidhushekhara Bharati Mahaswamiji on the occasion of the Divya Saptati Poorti Mahotsava (71st Vardhanti) of Dakshinamnaya Sringeri Sharada Peethadhishwara Jagadguru Shankaracharya Sri Sri Sri Bharati Tirtha Mahaswamiji*

***Printed at*** : *Vidya Bharati Press*
*Shankarapuram, Bangalore*
*560004*

*(an in–house publication wing of Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri 577139)*

***First Edition*** : *2024 (1000 copies)*

***Contribution Value*** : ₹ *40/-*

***Designed by*** : *Sri Shankara Advaita Research Centre, Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri*

*This book is distributed at a highly subsidised value for the sustenance and propagation of Sanatana Dharma, and to reach all sections of the society. The contribution value received for this book is used for charitable purposes.*

***Copies Available at*** : *Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri*

***Email*** : *adminoffice@sringeri.net*

WWW.SRINGERI.NET

# విషయానుక్రమః

1 సద్గురోః లక్షణాని ....................................................1

2 మాతృతః పితృతశ్శుద్ధః ...............................................7

3 శుద్ధభావః ..........................................................11

4 జితేంద్రియః ......................................................14

5 సర్వాగమానాం సారజ్ఞః..............................................18

6 సర్వశాస్త్రార్థతత్త్వవిత్ .................................................22

7 పరోపకారనిరతః ....................................................37

8 జపపూజాదితత్పరః..................................................40

9 అమోఘవచనః ......................................................42

10 శాంతః ............................................................44

11 వేదవేదాంగపారగః..................................................46

WWW.SRINGERI.NET

12 యోగమార్గానుసంధాయీ ..........................................52

13 దేవతాహృదయంగమః ..............................................54

14 గురువర్యదశశ్లోకీ ......................................................58

WWW.SRINGERI.NET

# సద్గురోః లక్షణాని

మాలాసుధాకుంభవిబోధముద్రా-
విద్యావిరాజత్కరవారిజాతాం ।
అపారకారుణ్యసుధాంబురాశిం
శ్రీశారదాంబాం ప్రణతోస్మి నిత్యం ॥

వక్తారమాసాద్య యమేవ నిత్యా సరస్వతీ స్వార్థసమన్వితాసీత్ ।
నిరస్తదుస్తర్కకలంకపంకా నమామి తం శంకరమర్చితాంఘ్రిం ॥

శాస్త్రాబ్ధిపారదృశ్వానం సంగహీనం తపోనిధిం ।
భజే శ్రీభారతీతీర్థగురుం భద్రౌఘదాయకం ॥

పరశివావతారులైన జగద్గురుశ్రీ ఆదిశంకరభగవత్పాదులు పన్నెండు శతాబ్దములక్రితము, కేరళదేశములో, పూర్ణానదీతీరమున, కాలటి యను అగ్రహారములో పుణ్యదంపతులైన ఆర్యాంబాశివగురువులకు పుత్రులై అవతరించినారు. శంకరులు ఎనిమిదేండ్లకే సర్వవేదములను అధ్యయనముచేసి తమ తల్లియైన ఆర్యాంబ అనుమతితో, నర్మదాతీరములో తపస్సునాచరించుచున్న గోవిందభగవత్పాదులను గురువుగా ఆశ్రయించిరి. వారివద్ద సన్న్యాసాశ్రమమును ప్రణవమహావాక్యోపదేశమును పొందినారు. పన్నెండేండ్లకే సర్వశాస్త్రములను నేర్చి, గోవిందభగవత్పాదులవారి అనుమతితో బదరికాశ్రమమును చేరి బ్రహ్మవేత్తలతో బ్రహ్మవిచారము సలిపి,

WWW.SRINGERI.NET

ప్రస్థానత్రయమనబడు భగవద్గీతా-దశోపనిషత్-బ్రహ్మసూత్రములకు అద్వైతసిద్ధాంతప్రతిపాదకములుగా విద్వజ్జనశిరోధార్యములైన భాష్యములను రచించినారు. అదే విధముగా ఉపదేశసాహస్రి, వివేకచూడామణి మొదలైన ప్రకరణగ్రంథములను వ్రాసినారు. అలాగే గణేశపంచరత్నము, సౌందర్యలహరి, శివానందలహరి మొదలైన రమణీయములైన అనేకస్తోత్రములను రచించినారు. ముమ్మార్లు సమగ్రభారతదేశపర్యటన చేసి వేదవిరుద్ధమతములనుసరించు వారిని వాదములో జయించినారు. సనాతనవైదికధర్మమును,



ఉపనిషత్తులలో చెప్పబడిన అద్వైతసిద్ధాంతమును సర్వత్ర ప్రచారము చేసినారు. కాశ్మీరములో సర్వజ్ఞపీఠమును అధిష్ఠించినారు. సనాతనవైదికధర్మప్రచారముకొఱకు భారతదేశముయొక్క నలుదిక్కులలో తూర్పున దక్షిణమున పశ్చిమమున ఉత్తరమున వరుసగా

WWW.SRINGERI.NET

పురీ-శృంగేరీ-ద్వారకా-బదరీ-క్షేత్రములలో గోవర్ధనపీఠ-శారదాపీఠ-కాళికాపీఠ-జ్యోతిష్పీఠములను నాలుగు ఆమ్నాయమఠములను ప్రతిష్ఠించిరి. వాటిలో వారి ముఖ్యశిష్యులైన హస్తామలకాచార్య-సురేశ్వరాచార్య-పద్మపాదాచార్య-తోటకాచార్యులను మొదటి పీఠాధిపతులుగా నియోగించిరి. అటు పిమ్మట కాశ్మీరములో సర్వజ్ఞపీఠమునధిరోహించి, వారి ముప్పదిరెండవయేట కేదారక్షేత్రమును చేరి, శిష్యానుగ్రహము చేసి, అవతారము ముగించి వారి స్వస్థానమైన కైలసమును పొందిరి.

అవతీర్ణశ్చ కాలట్యాం కేదారేంతర్హితశ్చ యః ।
చతుష్పీఠప్రతిష్ఠాతా జయతాచ్ఛంకరో గురుః ॥

జగద్గురువులు శ్రీశంకరభగవత్పాదులు దక్షిణదిశలో శృంగేరీక్షేత్రములో దక్షిణామ్నాయశృంగేరీశారదాపీఠమును ప్రతిష్ఠించి, వారి శిష్యులయందు జ్ఞానము పాండిత్యము వయస్సు ఈ మూడిటిలోను పెద్దవారైన శ్రీ సురేశ్వరాచార్యులను ప్రథమపీఠాధిపతిగా నియోగించిరి. తదనంతరము శ్రీవిద్యాతీర్థులు, శ్రీవిద్యారణ్యులు, శ్రీసచ్చిదానందభారతి, శ్రీనృసింహభారతి, శ్రీసచ్చిదానందశివాభినవనృసింహభారతి, శ్రీచంద్రశేఖరభారతి, శ్రీ అభినవవిద్యాతీర్థులు మొదలైన మహామహిమాన్వితులైన జగద్గురువులచే అధిష్ఠించబడిన ఈ పీఠము నేటికి అవిచ్ఛిన్నగురుపరంపరతో విరాజిల్లుచున్నది. ఈ పీఠమును అధిష్ఠించిన జగద్గురువులెల్లరు మహామహిమాన్వితులు, సకలశాస్త్రజ్ఞులు, తపస్వులు, శ్రుతిస్మృతిసదాచారములను పరిపాలించువారు, ప్రతిదినము శ్రీచంద్రమౌళీశ్వరుని శ్రీశారదాంబను అర్చించుచు తత్సన్నిధిలో ఆస్తికమహాజనుల యోగక్షేమములను ప్రార్థించువారు, జిజ్ఞాసువులకు అధికారానుసారము ధర్మతత్త్వమును బ్రహ్మతత్త్వమును ప్రబోధించువారునై జగత్పూజ్యులై విరాజిల్లుచున్నారు.

జగద్గురువులు శ్రీశంకరభగవత్పాదులు వివేకచూడామణిగ్రంథ

WWW.SRINGERI.NET

ప్రారంభములో

దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహహేతుకం ।
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః ॥

అని చెప్పారు. ఈ జగత్తులో **మనుష్యత్వము** (మనిషిగా పుట్టుట) **ముముక్షుత్వము** (మోక్షకాంక్షను కలిగి ఉండుట) **మహాపురుషసంశ్రయః** (దైవాంశసంభూతులైన మహాత్ముల అనుగ్రహము) అను ఈ మూడు గుణములు చాలా అరుదు. వీటిని భగవత్కృప లేకుండ బహుజన్మల పుణ్యఫలము లేకుండ పొందుట దుర్లభము అని ఈ శ్లోకముయొక్క తాత్పర్యము. ఒకరు మనుష్యజన్మను పొంది పూర్వజన్మల పుణ్యముచేత ముముక్షుత్వమును పొందినప్పటికి, మోక్షమార్గమును ఉపదేశించెడి సద్గురువును పొందలేకపోవచ్చు. మోక్షమును పొందుటకు బ్రహ్మజ్ఞానమును పొందవలెను. ఆ బ్రహ్మజ్ఞానమును పొందుటకు బ్రహ్మవిచారము జరుపవలెను. బ్రహ్మవిచారమును గురువు లేకుండ చేయుట సాధ్యము కాదు. ఎందుకనగా బ్రహ్మవిచారము చాలా గంభీరము. కనుక బ్రహ్మవిచారార్థము తప్పక బ్రహ్మనిష్ఠుడైన సద్గురువును ఆశ్రయించవలెను. అందుకే వేదము కూడా

పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో
నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన ।
తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం ॥

ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత ।
క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథస్తత్
కవయో వదంతి ॥ అని,

WWW.SRINGERI.NET

స్మృతి (భగవద్గీత) కూడా

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥

అని ఉపదేశించుచున్నవి. కనుక బ్రహ్మవిచారార్థము గురువును తప్పక ఆశ్రయించవలెను. గురువును ఆశ్రయించియే బ్రహ్మవిచారమును చేయవలెను. అప్పుడే బ్రహ్మవిచారము సఫలమగును. కాని మహాపురుషసంశ్రయము బహుజన్మల పుణ్యములు ఫలించిన భాగ్యవంతునకు మాత్రమే దొరుకును కావున మహాపురుషసంశ్రయము దుర్లభమని భగవత్పాదులు పలికిరి.

మహాపురుషులైన సద్గురువుల లక్షణములు శాస్త్రములో ఇట్లు చెప్పబడియున్నవి:

**మాతృతః పితృతశ్శుద్ధః శుద్ధభావో జితేంద్రియః ।**
**సర్వాగమానాం సారజ్ఞః సర్వశాస్త్రార్థతత్త్వవిత్ ॥**

**పరోపకారనిరతః జపపూజాదితత్పరః ।**
**అమోఘవచనశ్శాంతః వేదవేదాంగపారగః ॥**

**యోగమార్గానుసంధాయీ దేవతాహృదయంగమః ।**
**ఇత్యాదిగుణసంపన్నః గురురాగమసమ్మతః ॥**

ఈ కలియుగములో ఇట్టి లక్షణములు గల సద్గురువు ఎక్కడ దొరుకును అనగా:

దక్షిణామ్నాయశృంగేరీశారదాపీఠములో ముప్పదియారవ జగద్గురువులు శ్రీశ్రీభారతీతీర్థమహాస్వాములవారు పైచేప్పబడిన సర్వలక్షణములు గల వారు - అని నిశ్చయముగా మేము ఇట్లు చెప్పుచుంటిమి.

WWW.SRINGERI.NET

మా గురువరేణ్యులైన జగద్గురువులు శ్రీశ్రీభారతీతీర్థమహాస్వాములవారు ఈ దక్షిణామ్నాయశృంగేరీశారదాపీఠమునకు ముప్పదియారవ అధిపతులై సనాతనవైదికధర్మమును శ్రుతిస్మృతిప్రోక్తసదాచారమును పరిపాలించుచు శిష్యజనులనెల్లరిని అనుగ్రహించుచు సర్వశాస్త్రపారంగతులై జిజ్ఞాసువులకు యోగ్యతానుసారము ధర్మబ్రహ్మతత్త్వములను ప్రబోధించుచు శారదాపరమేశ్వరిని శ్రీచంద్రమౌళీశ్వరుని పూజించుచు తత్సన్నిధిలో ఆస్తికమహాజనుల యోగక్షేమములను ప్రార్థించుచు నిఖిలలోకవంద్యులై విరాజిల్లుచున్నారు.



WWW.SRINGERI.NET

# మాతృతః పితృతశ్శుద్ధః

సద్గురువుయొక్క మొదటిలక్షణము **“మాతృతః పితృతశ్శుద్ధః”**. సత్కులప్రసూతుడు - అని ఈ మాట అర్థము.

డెబ్బదియేండ్ల పూర్వము ఆంధ్రప్రదేశములో మచిలీపట్టణములో శ్రీ తంగిరాల వేంకటేశ్వర అవధానులను బ్రాహ్మణోత్తములుండిరి.

వారు చిననాడే కృష్ణయజుర్వేదమును సంపూర్ణముగా అధ్యయనము చేసి సదాచారసంపన్నులై గృహస్థాశ్రమమును ప్రవేశించి ఆ ఆశ్రమమునకు ఉచితములైన ధర్మములను చక్కగా అనుష్ఠించుచు భగవదనుగ్రహముచే లభించిన పదార్థములతో సంతుష్టులై సత్త్వగుణసంపన్నులై సర్వజనుల గౌరవాదరములను పొందిరి. వారి పత్ని మహాసాధ్వి అనంతలక్ష్మమ్మ. ఆ పుణ్యదంపతులకు ఇద్దరు కుమార్తెలు కలిగిరి.

అవధానులవారు మచిలీపట్టణమును చేరక ముందు అలుగుమల్లెపాడు అను ఒక అగ్రహారములో నివసించుచు పుత్రసంతానమును కోరి అచ్చటి భవానీశంకరేశ్వరుడిని ఒక సంవత్సరకాలము చాలా శ్రద్ధతో ప్రతిదినము మహాన్యాసపూర్వకరుద్రాభిషేకముతో పూజించిరి.

అప్పుడు భగవంతుడు వారి పూజకు సంతుష్టుడై వారిని అనుగ్రహించెను. శ్రీమతి అనంతలక్ష్మమ్మ గర్భవతి అయ్యెను. ఆవిడ గర్భవతిగా ఉన్నప్పుడు గర్భములో ఉన్న శిశువుయొక్క దైవీసంపత్తును సూచించెడి నిమిత్తములు కనబడినవి. ఒక నాడు ఆవిడకు స్వప్నమందు ఆంజనేయస్వామి సాక్షాత్కరించి అత్యంతప్రసన్నుడై మూడు మామిడిఫలములనిచ్చి

"నీకు సకలసద్గుణోపేతుడు జగద్వంద్యుడునైన పుత్రుడు జన్మించును" అని అనుగ్రహించి అంతర్ధానము చెందెను. అటు పిమ్మట ఖరనామసంవత్సరములో వసంత ఋతువులో చైత్రమాసమందు శుక్లపక్షములో షష్ఠినాడు అనంతలక్ష్మమ్మ సకలసద్గుణోపేతుడు, సకలానందకరుడునైన పుత్రుని ప్రసవించెను. ఆ పుత్రుడు తనని చూచువారందరి మనస్సులకు ఎంతో ఆహ్లాదమును కూర్చెను. ఆ పుత్రునికి "సీతారామాంజనేయులు" అని పేరు పెట్టబడినది.

సీతారామాంజనేయులు చిన్నవయసులోనే ఒక్క క్షణము కూడ వ్యర్థము జేయక యెల్లప్పుడు భగవత్స్మరణమున్నగు సత్కార్యములు చేయుచు, నిర్దుష్టముగా సంస్కృతములో భాషించుచు సంస్కృతప్రియులను విద్వాంసులను అబ్బురపరిచెను. ఉపనయనానంతరము ప్రతిదినము గాయత్రీదేవిని ఉపాసించుచు, వేదాధ్యయనము చేయుచు, తల్లిదండ్రులకు శుశ్రూష సలుపుచు, సర్వజనులకు ఆదరపాత్రమయ్యెను. సీతారామాంజనేయశర్మ వేదాధ్యయనమును పూర్తిచేసి శాస్త్రమును నేర్వగోరుచు, మహాకాలేశ్వరుని నిలయమగు ఉజ్జయినిలో చాతుర్మాస్యవ్రతమును అనుష్ఠించుచున్న దక్షిణామ్నాయశృంగేరీశారదా పీఠముయొక్క ముప్పదియైదవ అధిపతులు సర్వశాస్త్రపారంగతులునైన జగద్గురు శ్రీశ్రీ అభినవవిద్యాతీర్థమహాస్వామివారిని సమాశ్రయించి వారి సకాశమున శాస్త్రాధ్యయనము చేయవలెనన్న తన కోరికను ప్రకటించిరి.



WWW.SRINGERI.NET

జగద్గురు శ్రీశ్రీ అభినవవిద్యాతీర్థమహాస్వామివారు ఈ బ్రహ్మచారియొక్క శ్రద్ధను, వినయమును, సౌశీల్యమును, కుశాగ్రబుద్ధిని చూచి అత్యంతసంతుష్టులై వెంటనే శాస్త్రాధ్యయనార్థము యేర్పాట్లను కల్పించిరి. కొన్ని గ్రంథములను స్వయముగా అధ్యాపన చేసిరి. కొన్ని గ్రంథముల అధ్యయనమునకు శాస్త్రములో మిక్కిలి పరిశ్రమ చేసిన ప్రౌఢవిద్వాంసులైన శ్రీ గొల్లపూడి గోపాలక్రిష్ణశాస్త్రి వారిని నియోగించిరి.

స్వల్పకాలములోనే బ్రహ్మచారియైన సీతారామాంజనేయశర్మ సర్వశాస్త్రములయందు ఉత్కటవైదుష్యమును పొందెను. జగద్గురుశ్రీ అభినవవిద్యాతీర్థమహాస్వామివారు ఆ బ్రహ్మచారియొక్క వైదుష్యమును, దక్షతను, ధర్మనిష్ఠను చూచి శారదాదేవియొక్క అనుజ్ఞను పొంది ఆ బ్రహ్మచారికి ఆనందసంవత్సరములో సన్న్యాసమును, ప్రణవోపదేశమును, **"భారతీతీర్థ"** అను యోగపట్టమును అనుగ్రహించిరి. ఈ విధముగా సనాతనధర్మమునకు శృంగేరీశారదాపీఠమునకు కూడ శుభపరంపరాప్రాప్తికి నాంది పలికినారు.

అటుపై జగద్గురు శ్రీశ్రీ భారతీతీర్థమహాస్వామివారు దక్షిణామ్నాయశ్రీశారదాపీఠముయొక్క 36వ జగద్గురువులుగా వేదశాస్త్రసంప్రదాయమును, సనాతనవైదికధర్మమును రక్షించుచు, సర్వత్ర



WWW.SRINGERI.NET

సనాతనధర్మమును ప్రచారము చేయుచు, ప్రతిదినము శారదాదేవిని చంద్రమౌలీశ్వరుని పూజించుచు, జిజ్ఞాసువులకు ధర్మతత్త్వమును బ్రహ్మతత్త్వమును యథాయోగ్యముగా బోధించుచు, అపూర్వములు అసాధారణములు అయిన ఎన్నో సత్కార్యములను చేయుచు, సర్వలోకవంద్యులై విరాజిల్లుచున్నారు. వారి అనుగ్రహముచే సర్వజనులకు శ్రేయఃపరంపర కలుగునను విషయము నిస్సందేహము.

ఎనిమిదిసంవత్సరములక్రిందట, ఆంధ్రదేశమున, జగద్గురువుల జన్మస్థలమైన మచిలిపట్నములో, ఒక శాఖామఠమును నిర్మించవలెనని పీఠముయొక్క శిష్యులు ఆ నిర్మాణకార్యమును మొదలు పెట్టారు. ఆ సందర్భములో భూమిని త్రవ్వుచుండగా, ఆ భూమిలో శిలామయమైన ఆంజనేయస్వామియొక్క మూర్తి దొరికినది. ఎక్కడయితే పరమసాధ్వియైన అనంతలక్ష్మమ్మగారు స్వప్నమందు హనుమత్సాక్షాత్కారమును పొంది సకలసద్గుణసంపన్నుడైన పుత్రుని కనెనో, ఆ స్థలమందే బాలహనుమంతుని మూర్తి దొరకుట మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయము. అటుపై మేము అక్కడ ఆంజనేయస్వామికి ఒక మందిరమును నిర్మించి, శాఖామఠమును నెలకొల్పి, అక్కడ ఆ హనుమన్మూర్తిని ప్రతిష్ఠించి కుంభాభిషేకమును చేసినాము. ఇప్పుడు ఆంజనేయస్వామి అచ్చట నెలకొని అందరిని అనుగ్రహించుచున్నాడు.



WWW.SRINGERI.NET

# శుద్ధభావః

గురువుయొక్క రెండవ లక్షణము - **శుద్ధభావః**. అనగా శుద్ధమైన స్వభావము కలిగియుండుట. ఎవరైతే ఎల్లప్పుడు మనస్సుతో పరుల హితమును మాత్రమే కోరుచు, మాటతో పరులకు హితమును మాత్రమే పలికి, శరీరముతో పరులకు హితమును మాత్రమే ఆచరింతురో, అతను శుద్ధభావుడనబడుతాడు. ఎవరైతే మనస్సులో అపకారబుద్ధిని దాచిపెట్టి, పరులకు హితమును చేయుచున్నట్లుగా నటించునో, అతడు శుద్ధభావుడు కాడు, కాని వంచకుడనబడుతాడు.

జగద్గురువులు నిరంతరము సర్వజనుల క్షేమమును కోరి శారదాంబను చంద్రమౌలీశ్వరుడిని పూజిచుచు ఉంటారు.

ఒకనాడు మా సన్న్యాసస్వీకారముపిమ్మట మా గురువుల "నేడు మీరు చంద్రమౌలీశ్వరపూజను చేయాలి" అని ఆజ్ఞాపించారు. అప్పుడు పూజలో ఏమని సంకల్పము చేయాలని మేము అడుగగా, " 'సర్వజనుల యోగక్షేమార్థము' అని సంకల్పము చేయవలెను. ఇంతకన్న కోరదగినది మనకు వేరేది లేదు. ఇక్కడే కాదు, విజయయాత్రలందు, క్షేత్రములందు భగవత్పూజలు చేసినప్పుడు కూడ ఇదే సంకల్పమును చేయుచున్నాము" అని గురువులు సెలవిచ్చారు.

అలాగే ఇంకొకమారు మమ్ము ఒక యంత్రమును నిర్మించవలెనని జగద్గురువులు నిర్దేశించినారు. "ఈ యంత్రముయొక్క ఆరాధనచే సర్వజనులకు సౌఖ్యము కలుగును. కావును నీవు ముందు

మంత్రశాస్త్రోక్తవిధానములో ఆ యంత్రమును చిత్రీకరించు" అని ఆనతినిచ్చారు. యంత్రములో ఎన్నో పద్మాలు ఉంటాయి, ఆ పద్మములయొక్క దళములలో మంత్రాక్షరములను వ్రాయవలెను. ఆ యంత్రమును మంత్రశాస్త్రానుసారముగా మా గురువులకు సమర్పించిన పిమ్మట, గురువులు దానిని చూచి "శాస్త్రప్రకారము అంతర్ముఖముగా ఉన్న అక్షరాలు కలిగిన యంత్రమును ఆరాధించినచో సాధకుడు నిగ్రహించదలచిన వారికి కీడు కలుగుతుంది. బహిర్ముఖమైన అక్షరములతో కూర్చిన యంత్రమును పూజించుటచే సాధకుడు అనుగ్రహించదలచినవానికి శ్రేయస్సు కలుగుతుంది. ఇప్పుడు మీచే చిత్రీకరించబడిన ఈ యంత్రములో వ్రాయబడిన అక్షరములు



అంతర్ముఖముగా వ్రాసియున్నవి. కావున దీని ఆరాధనచే శత్రునాశము జరుగుతుంది. కానీ, మనకు శత్రువులెవ్వరు లేరు. ఎల్లరికి అనుగ్రహము చేయుటయే మన కర్తవ్యము. తదర్థమే ఈ యంత్రమును మేము నిర్మించదలచినాము. కావున మీరు ఈ యంత్రమున అక్షరములను బహిర్ముఖముగా లిఖించవలెను. ఆ పిమ్మట ఈ యంత్రమునకు మఠమునందు పూజల జరుపబడును" అని వారు నిర్దేశించినారు. ఆ

WWW.SRINGERI.NET

ప్రకారముగా మేము మరల బహిర్ముఖమైన అక్షరములతో యంత్రమును నిర్మించినాము.

కావును "శుద్ధభావత్వము" - అనగా సకలజనులకు హితము కోరుట - అనెడు గురువుయొక్క లక్షణము మా గురువర్యులయందు స్పష్టముగా గోచరమగుచున్నది.

WWW.SRINGERI.NET

# జితేంద్రియః

గురువుయొక్క మూడవ లక్షణము - **"జితేంద్రియః"**. అనగా ఇంద్రియములను నిగ్రహించిన వాడు. ఇంద్రియములపై నిగ్రహములేనిచో, మనము బ్రహ్మవిచారము చేయజాలము. విచారము చేయనిచో జ్ఞానమును పొందలేము. జ్ఞానము లభించనిచో మోక్షమును పొందలేము. కావున జ్ఞానార్థము బ్రహ్మవిచారమును తప్పనిసరిగా చేయవలెను. ఈ విచారమందు అధికారికి సాధనచతుష్టయమను నాలుగు లక్షణములు ఉండవలెను. ఆ సాధనచతుష్టయములో మూడవదైన సాధనము శమాదిషట్కము (శమము మొదలైన ఆరు గుణములు). వాటిలో శమదమములచే ఇంద్రియనిగ్రహము సూచించబడినది. కావున ఇంద్రియనిగ్రహము కలిగిన పురుషుడే బ్రహ్మవిచారము చేయగలడు. ఇంద్రియనిగ్రహము లేని వాడు బ్రహ్మతత్త్వమును తెలుసుకొనలేకపోవుటచే సంసారమును దాటలేడు, పరులను దాటించలేడు. ఇందువలన గురువునకు ఇంద్రియనిగ్రహము అత్యావశ్యకము.

కఠోపనిషత్తులో -

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇంద్రియాణి హయానాహుః విషయాంస్తేషు గోచరాన్ ।
ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః ॥

WWW.SRINGERI.NET

యస్త్వవిజ్ఞానవాన్ భవతి అయుక్తేన మనసా సహ ।
తస్యేంద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః ॥

యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా ।
తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః ॥

అని చెప్పి, కడకు

విజ్ఞానసారథిర్యస్తు మనఃప్రగ్రహవాన్నరః ।
సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదం ॥

అని చెప్పబడియున్నది.



ఈ మంత్రములకు అర్థము - లోకములో ఒక చోటును చేరదలచిన వాడు ఒక వాహనమును అధిరోహించవలెను. ఆ రథమునకు సమర్థుడైన సారథి కావలెను. ఆ సారథి పగ్గాలతో గుఱ్ఱములను బంధించి, వాటిని అదుపులోపెట్టి, రథమును నడిపించుట ప్రసిద్ధము. సారథి అశ్వములను నియంత్రించుటయందు నిపుణుడైనచో రథికుడిని గమ్యమునకు చేర్చగలడు. లేనిచో, అశ్వములు వాటికి తోచిన చోటికి ఆ రథమును ఈడ్చుకుపోయి గమ్యమునకు రథికుడిని చేర్చవు.

ఇదే విధముగా, ఉపనిషత్తు చూపిన ఉపమానములో - జీవుడు రథికుడు. శరీరము రథము. బుద్ధి సారథి. మనస్సు పగ్గములు. ఇంద్రియములు

గుల్మములు.

ఈ శరీరమును అధిష్ఠించిన జీవుడు, శాస్త్రాచార్యోపదేశములచే బుద్ధిని సంస్కరించుకొని, ఆ సంస్కృతబుద్ధితో మనస్సును నిగ్రహించి, నిగ్రహింపబడిన మనస్సుతో ఇంద్రియములను జయించి, బ్రహ్మవిచారమును చేసి, సర్వవ్యాకపమైన పరమత్మయొక్క స్థానమును (అనగా పరమాత్మతో ఐక్యమును) పొంది ముక్తిని పొందును.

జీవుడు ఇంద్రియములను నిగ్రహించినమాత్రమే తనకు అభిమతమైన మోక్షపదమును చేరగలడు. ఇంద్రియములపై నిగ్రహములేనిచో, జననమరణమయమైన సంసారమందే బద్ధుడైయుండును.

ఇందుచేతనే మన పెద్దలు

మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతం ॥



WWW.SRINGERI.NET

అని చెప్పియున్నారు. మనస్సు విషయాసక్తమైనచో జీవునకు సంసారహేతువు, అదే మనస్సు విషాయసక్తిలేక నిర్విషయమైనప్పుడు ముక్తికి కారణమగుచున్నది. ఈ అర్థమునే కఠోపనిషత్తు "విజ్ఞానసారథిర్యస్తు మనఃప్రగ్రహవాన్నరః, సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదం" - అని చెప్పుచున్నది.

కాబట్టి ఇంద్రియములు నిగ్రహించబడినప్పుడు మోక్షమునకు క్రమక్రమముగా ఉపకరించును. అవే యథేచ్ఛగా వదలబడినప్పుడు సంసారబంధమునకు కారణములు.

ఇందుచే జితేంద్రియత్వము అంత్యంతావశ్యకము. జితేంద్రియుడు స్వయముగా తరించి, పరులను తరించచేయగలడు. ఈ గురులక్షణమైన జితేంద్రియత్వము మా గురువరేణ్యులందు స్పష్టముగా గోచరించుచున్నది.

WWW.SRINGERI.NET

# సర్వాగమానాం సారజ్ఞః

గురువుయొక్క నాలుగవ లక్షణము "సర్వాగమానాం సారజ్ఞః". పురాణ-ఇతిహాస-ధర్మశాస్త్రాదులయందు మర్మములనెఱిగినవాడని అర్థము. ఈ శాస్త్రములన్నింట మా గురువర్యులకు అపారమైన వైదుష్యము కలదు.

ఈ గ్రంథములందు కొన్ని విషయములలో విరోధములున్నట్లు కనబడును. ఆ గంభీరమైన విచారములు సామాన్యులకు అర్థమగుట కష్టము. అట్టి విషయములను మా గురువరులు చక్కగ పరిష్కరించిరి బోధించినారు.

గీతయొక్క తృతీయాధ్యాయములో

> దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః ।
> పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥

అని కృష్ణపరమాత్మ చెప్పినాడు. ఈ శ్లోకముయొక్క అర్థము భగవత్పాదుల భాష్యములో ఇలా చెప్పబడియున్నది - "ఓ మనుష్యులారా! మీరు యాగములచే దేవతలను సంతోషపెట్టండి. యాగాదులచే సంతోషించిన ఇంద్రాదిదేవతలు వృష్టి, ఆహారము, మొదలైన వాటినిచ్చి మిమ్ములను పోషింతురు. కావున ఒకరినొకరు సంతోషింపజేయుచు మీరు స్వర్గమును, క్రమముగా మోక్షమును పొందుదురు".

కాని భాగవతములో ఒక ఘట్టము కనబడుచున్నది. నందగోపుడు ఇంద్రుని పూజించదలచినప్పుడు కృష్ణపరమాత్మ "ఈ గోవర్ధనపర్వతమే

WWW.SRINGERI.NET

మనకు మరియు గోవులకు కావలసిన పదార్థములన్నిటిని ఇచ్చుచున్నది. కావున ఇంద్రుని పూజించనేల? గోవర్ధనగిరినే పూజించెదము." అని నందగోపుని ఇంద్రపూజనుండి వారించెను. కాని ఈ కృష్ణపరమాత్మయే గీతలో మనలను పోషించు ఇంద్రాదులను పూజించవలెను అని చెప్పియున్నాడు. ఇక్కడ విరోధమున్నట్లు కనబడుచున్నది. దీని పరిష్కారమును జగద్గురువులు ఇట్లు సెలవిచ్చినారు-

యాగాదులచే దేవతలను సంతోషింపజేయవలెను అను మాట్లలో ఎట్టి సందేహము లేదు. కాని ఇంద్రునికి లోకపాలనచే అహంకారము పెరిగినది. తానే సర్వేశ్వరుడను భావనతో పరమాత్మను మరచినాడు. ఆ గర్వమును పరిహరించుటకు ఈ లీల. నందుడు తనను పూజించలేదను క్రోధముతో ఇంద్రుడు రాళ్ళవానను కురిపించగా, పరమాత్మ ఆ గోవర్ధనపర్వతమును తన వ్రేలన్ ధరించి, గోపసమూహమును గోవులను రక్షించెను. అది చూచిన ఇంద్రునకు గర్వభంగమైనది. సిగ్గు పడి భగవంతుడి పాదములపై పడి క్షమించమని ప్రార్థించెను - అని భాగవతము మనకు తెలుపుచున్నది.



WWW.SRINGERI.NET

కావున ఇంద్రుడు యే పరాత్మయొక్క అనుగ్రహముచే లోకపాలకుడైనాడో, ఆ పరమాత్మనే మరచి ప్రవర్తించుచుండగా, అతనికి సరియైన అవగాహన కలిగించుటకు పరమాత్మ నందగోపుడిచే ఇంద్రపూజను మానిపించి, ఈ లీలను జరిపించినాడు. కావున ఇక్కడ ఏ మాత్రము విరోధములేదు.

ఇట్లు మా గురువరేణ్యులు విరోధమువలె కనబడున్న ఈ రెండు విషములను సమన్వయ పరిచిరి. మా గురువర్యులు సమయము దొరికినప్పుడెల్ల గ్రంథములను అవలోకనము చేయుచుందురు. అందుగల అపూర్వవిషయములను శిష్యులకు ఉపదేశించుచుందురు. శ్రీమద్భాగవతములో సాధుజనుల గొప్పతనమును తెలియజేయు శ్లోకమొకటి కలదు -

న హ్యమ్మయాని తీర్థాని న దేవా మృచ్ఛిలామయాః ।
తే పునంత్యురుకాలేన దర్శనాదేవ సాధవః ॥ అని.

లోకమందు నదీసముద్రాదిజలములందు తీర్థములను, శిలామయవిగ్రహములందు దేవతలను పూజించుట సుప్రసిద్ధము. కాని



WWW.SRINGERI.NET

ఈ శ్లోకములో తీర్థములు జలరూపములు కావు, దేవతలు శిలామయులు కారు అని చెప్పబడినది. ఎందుకనగా జనులకు ఆ తీర్థములను దేవతలు పూజించి పవిత్రతను సంపాదించుటకు సుదీర్ఘకాలము కావలెను. కాని జనులు సాధువులను దర్శించినంతనే పవిత్రులగుదురు - అని చెప్పబడియుంది. ఈ విధముగా చూచినచో విరోధమున్నట్లున్నది. ఇక్కడ శ్లోకములో "న" అను శబ్దము రెండు మార్లు ప్రయోగించబడినది. ఇట్లు అర్థముచేసికొనవలెను - శిలావిగ్రహరూపులైన దేవతలు జనులను పవిత్రము చేయరని కాదు, జలరూపములుగా ఉన్న తీర్థములు జనులను పవిత్రము చేయవని కాదు, కాని అవి తప్పకుండ పవిత్రతను చేకూర్చును. అయితే వాటికి సుదీర్ఘకాలమగును. సాధువులు దర్శనమాత్రముచే జనులను పవిత్రితులను చేయుదురు - అని సమన్వయము భాగవతములో శ్రీధరీవ్యాఖ్యలో చెప్పబడినది. ఈ విషయమును గురువర్యులు ఒకానొక సందర్భములో చెప్పియున్నారు. ఈ విధముగా వారికి పురాణాద్యాగమములందు అపారమైన వైదుష్యము కలదు కావున **"సర్వాగమానాం సారజ్ఞః"** అను గురులక్షణము వారియందు స్పష్టముగా కానవచ్చుచున్నది.

WWW.SRINGERI.NET

# సర్వశాస్త్రార్థతత్త్వవిత్

అటు పిమ్మట "**సర్వశాస్త్రార్థతత్త్వవిత్**" అను లక్షణము చెప్పబడినది. న్యాయ-వ్యాకరణ-వేదాంత-మీమాంసాదిశాస్త్రములలో మా గురువర్యులకు కల అపారమైన పాండిత్యమును కొద్దిమాటలతో వర్ణించనలవి కాదు. వారు శాస్త్రాధ్యయనము చేసిన విధానము అత్యద్భుతమైనది. వారు బ్రహ్మచర్యదశలో శాస్త్రాధ్యయనమును న్యాయవిద్వాంసులు మహాపండితులైన శ్రీ గొల్లపూడి గోపాలకృష్ణశాస్త్రుల వద్ద కావించినారు. వారు పొద్దునపూట తర్కశాస్త్రవాదగ్రంథములను పాఠము చేయుచుండేవారు. యే విషయములను పొద్దున పాఠమందు చెప్పబడుచుండేవో, ఆ విషయములను గురువులు మధ్యాహ్నమందు శాస్త్రిగారి వద్ద చింతన చేసేవారు. పాఠమును ఒకమారు విని యథాతథముగా అప్పచెప్పేవారు. ఆయావిషయములను వారు ఒకమారు విన్నంతనే స్మృతిపథములో నిక్షిప్తమును చేసిపెట్టుచుండేవారు. ఈ విషయములో శ్రీవిద్యారణ్యమహాస్వామివారు రచించిన శంకరదిగ్విజయములో ఒక శ్లోకము అన్వయించుచున్నది.

అజని దుఃఖకరో న గురోరసౌ
శ్రవణతః సకృదేవ పరిగ్రహీ ।
సహినిపాఠజనస్య గురుః స్వయం
స చ పపాఠ తతో గురుణా వినా ॥ అని.

WWW.SRINGERI.NET

పాఠసమయమందైన మరి యే సందర్భములోనైన భగవత్పాదులు గురువుగారికి ఎన్నడు ఇబ్బందిని కలిగించలేదు. గురువు బోధించిన అంశములను ఒక మారు వినినంతనే అర్థముచేసికొని మరువక ధారణలోనుంచుచుండేవారు. ఈ విధముగా అధ్యయనము చేసినచో, గురువునకెన్నడు పాఠము చేయుటలో శ్రమ కలుగదు. అట్టి శిష్యునకు పాఠము చేయుటకై గురువు ఉత్సాహమును పొందును. భగవత్పాదులు అట్టి శిష్యుడు.

**సహనిపాఠజనస్య గురుస్స్వయం** - అధ్యయనకాలమందే గురువుగారికి శంకరులు సరిసాటియన్నట్లుండుటచే, తమ సహాధ్యాయులైన విద్యార్థులకు వారే స్వయము పాఠము కూడ చేసిరి. ఆ సహపాఠులకు పాఠమందు ఏర్పడిన సందేహములను నివృత్తి చేసేవారు. ఆ విధముగనే మా గురువులు కూడ అధయయనకాలమందే శృంగేరీపాఠశాలలో చదువుచున్న ఇతరవిద్యార్థులకు సందేహనివృత్తి చేసేవారు.

అటుపై **"స చ పపాఠ తతో గురుణా వినా"** అని చెప్పబడినది. దీనికి అర్థము - కొన్ని గ్రంథములను మాత్రమే గురువుగారు పాఠము చేసిరి. మిగిలిన గ్రంథములను శంకరులు స్వయముగా చదివి అర్థముచేసుకొనిరట. అటులనే మా గురువర్యులు కూడ కొన్ని గ్రంథములను గురుముఖతః అధ్యయనముచేసి, అటుపై క్రోడపత్రాదులను స్వయముగా చదివిరి.

న్యాయశాస్త్రములో చతుర్దశలక్షణీగ్రంథములో ప్రగల్భలక్షణములు రెండున్నవి. రెండవ లక్షణము గురించి మహాగణపతివాక్యార్థవిద్వత్సభలో బ్రహ్మచారులైన గురువర్యులు ఒక వాక్యర్థమును చేసినారు. వారు ప్రతిపాదించిన విషయములు క్రొత్తగా, బహుగంభీరముగా ఉండెను. వారు వాక్యర్థమును ముగించిన తరువాత జగద్గురుశ్రీ అభినవవిద్యాతీర్థమహాస్వామివారు మిక్కిలి సంతసించి "నీవు చెప్పిన విషయములు ఎక్కడివి? ఎవరి వద్ద పాఠము చెప్పించుకున్నవి?" అని అడిగిరి. అప్పుడు మా గురువర్యులు "ఈ విషయము



ప్రగల్భద్వితీయలక్షణమును విచారించెడి **'నచరత్నమాలికా'** అను క్రోడపత్రములోనున్నది. ఈ విషయమును ఎవ్వరు పాఠము చేయలేదు, నేనే స్వయముగా చదువుకొని వాక్యార్థము చేసినాను" అని సవినయముగా అన్నారు. ఈ మాటకు సంతుష్టులై జగద్గురుశ్రీమదభినవవిద్యాతీర్థమహా స్వామివారు మా గురువర్యులను నిండుగా ఆశీస్సులతో అనుగ్రహించిరి. ఈ విధముగా మా గురువర్యుల అధ్యయనక్రమము శంకరభగవత్పాదుల అధ్యయనక్రమమును జ్ఞప్తికి తెచ్చుచున్నది.

శృంగేరిలో సుమారు నూటముప్పది సంవత్సరములుగా ప్రతి యేడాది మహాగణపతివాక్యార్థవిద్వత్సభ జరుగును. శాస్త్రములలో అమితమైన కృషిని చేసి చక్కని పాండిత్యమును సంపాదించిన విద్వాంసులు మాత్రమే

WWW.SRINGERI.NET

ఈ సభను ప్రవేశించగలరు. ముందుగా సకలశాస్త్రవేత్తలైన జగద్గురువులే న్యాయశాస్త్రమునందు వాక్యార్థమును జేసి సభను ప్రారంభింతురు. అటు పిమ్మట విద్వాంసులు వారి వారి వాక్యార్థములను చేయుదురు. కావున భారతదేశములో ఈ మహాగణపతివాక్యార్థసభ అత్యంతశ్రేష్ఠముగా ప్రకాశించుచున్నది.

ఒక సారి వాక్యార్థసభలో గురువర్యులు న్యాయశాస్త్రములో సామాన్యనిరుక్తిగ్రంథములో "విశిష్టద్వయాఘటితత్వం" అను విషయము గురించి వాక్యార్థమును చేసిరి. ఆ సందర్భములో బహుశాస్త్రపండితులైన విద్వాంసులచ్చట ఉండిరి. వారిలో ఆంధ్రదేశీయులు, న్యాయశాస్త్రవిద్వాంసులు అయిన మద్దులపల్లి మాణిక్యశాస్త్రిగారు కూడ ఉండిరి. గదాధరభట్టాచార్యులు హేత్వాభాససామాన్యలక్షణములో అనతిరిక్తవృత్తిత్వరూపావచ్ఛేద కత్వమును చేర్చినచో మహావిశిష్టములో అతివ్యాప్తిని ప్రదర్శించి తద్వారణార్థము విశిష్టద్వయాఘటితత్వవిశేషణమను దళమును చేర్చినారు. గురువర్యులు ఈ విచారమును ఉపస్థాపన చేయుచున్న సమయములో మాణిక్యశాస్త్రిగారు "మహావిశిష్టములో అతివ్యాప్తిని వారించుటకై అనతిరిక్తవృత్తిత్వరూపావచ్ఛేదకత్వమువలె స్వరూపసంబంధరూపావచ్ఛేదకత్వమును కూడ చేర్చవచ్చు. దానితోనే మహావిశిష్టమందు అతివ్యాప్తిని వారించుట శక్యమైయుండగా, గురుభూతమైన దళముయొక్క నివేశమెందుకు?" అని ప్రశ్నించిరి. వెంటనే గురువులు "అనతిరిక్తవృత్తిత్వరూపావచ్ఛేదకత్వమునువలె స్వరూపసంబంధరూపావచ్ఛేదకత్వమును లక్షణమందు నివేశము చేసినచో వ్యాపకసామానాధికరణ్యఘటితసత్ప్రతిపక్షమందు అతివ్యాప్తిదోషము కలుగుతుంది, కావున భట్టాచార్యులు చెప్పిన విశిష్టద్వయాఘటితత్వనివేశనమే యుక్తియుక్తము" అని సమాధానమును వెంటనే చెప్పి మిగిలిన విచారమును పూర్తి చేసిరి. తరువాత శాస్త్రిగారు గురువర్యుల చెంతకు వచ్చి సాష్టాంగముగా నమస్కరించి

“నేను ఎన్నో వాక్యార్థసభలలో పాల్గొనినాను. ఎక్కడెక్కడయితే విద్వాంసులు విశిష్టద్వయాఘటితతత్వవిచారమును చేయుదురో, అక్కడ నేను ఈ ప్రశ్నను చేయుచుండేవాడిని. అందరు పండితులు దీని సమాధానమును ఆలోచించవలెనని కాని, సమాధానము తెలియదని కాని చెప్పుచుండేవారు. ఏ ఒక్కరివద్ద దీనికి సమాధానము లభించలేదు. కాని



శ్రీచరణులు తత్క్షణమే సమాధానము చెప్పి సందేహనివృత్తి చేసిరి. ఇట్టి వైదుష్యము శ్రీచరణుల వద్ద మాత్రమే కలదని దీని చేత స్పష్టమైనది” అని చెప్పి ఆనందముగా మరల నమస్కరించిరి. అట్టి అసామాన్యపాండిత్యము మా గురువర్యులకు న్యాయాదిసర్వశాస్త్రములందు కలదు.

గురువర్యులు స్వయముగా సర్వశాస్త్రపారంగతులై, శాస్త్రపోషకసభ ద్వారా శాస్త్రప్రచారము కావించి, శాస్త్రవిద్వాంసులను సన్మానించి, ప్రోత్సహించి, స్వయముగా విద్యార్థులకు శాస్త్రమును అధ్యాపన చేయుచుందురు. తాము శాస్త్రవిద్వాంసులై జిజ్ఞాసువులైన విద్యార్థులకు నియమముగా పాఠము చేయుట విశేషము. మఠకార్యక్రమములు ఎన్ని ఉన్నప్పటికి, ఎన్నడు శాస్త్రపాఠమునకు మినహాయింపునివ్వరు. ఖరనామసంవత్సరములో చైత్రమాసములో వారు మాకు న్యాయశాస్త్రపాఠమును ప్రారంభించిరి.

WWW.SRINGERI.NET

పాఠము తర్కసంగ్రహముతో మొదలయినది. అటుపై కేవలము పదకొండు నెలలలో తర్కసంగ్రహము, నీలకంఠీవ్యాఖ్యతో పాటు దీపిక, న్యాయసిద్ధాంతముక్తావళి, దినకరి - ఈ గ్రంథములన్నింటిని పాఠము చేసిరి. అటుపై దక్షిణభారతములో యాత్ర ప్రారంభమయినది. పదమూడు నెలలపాటు కర్ణాటక-తమిళ్ నాడు-కేరళ-అంధ్రప్రదేశములలో (ప్రస్తుత తెలంగాణ/అంధ్రప్రదేశములు) గురువుల విజయయాత్ర సాగినది. ఆ సందర్భమందు కూడ ఎక్కడ పాఠమును వీడలేదు. విజయయాత్ర జరిగిన పదమూడు నెలలలో న్యాయశాస్త్రమందు గాదాధరిలో పంచలక్షణి, చతుర్దశలక్షణి, సిద్ధాంతలక్షణం, పక్షతాగ్రంథము, ప్రతిజ్ఞాలక్షణము వరకు అవయవగ్రంథమును పాఠము చేసిరి.



శంకరభగవత్పాదులు ముమ్మారు సమగ్రభారతదేశమంతా పాదయాత్రను చేయుచున్నను శిష్యులకు భాష్యాదిపాఠమును చేసినట్లే మా గురువులు కూడా యాత్రయందు కూడ మాకు న్యాయవేదాంతశాస్త్రములను పాఠము చేసిరి. **స్వయముగా శాస్త్రపండితులై, ప్రతిదినము శాస్త్రపాఠము చేయుచు, శాస్త్రపోషకసభను నడిపించిరి మా గురువర్యులు. ఇదియే అసలైన శాస్త్రపోషకత్వము.**

WWW.PRNCERI.NET

మా గురువర్యులు మాకు పాఠము చేయుచున్నప్పుడు, ఒక గ్రంథము పూర్తి అయిన తరువాత నేను "ఈ గ్రంథములో పరీక్ష ఎప్పుడు జరుగుతుంది" అని వారిని అడిగినాను. దానికి వారు "మేము పాఠము చేయు పద్ధతిలో, ఫలానారోజున పరీక్ష ఉంటుంది, దానికోసము నీవు చక్కగా చదువుకో, పరీక్షలో ఉత్తీర్ణుడవు కమ్ము, అనే మాటలకవకాశము లేదు. మేము నిరంతము పరీక్షిస్తూనే ఉంటాము. ఎప్పుడెప్పుడైయితే మేము నిన్ను ప్రశ్నింతుమో అప్పటికప్పుడు నీవుకూడ సమాధానము చెప్పుటకై సిద్ధముగా ఉండవలెను." అని ఆదేశించిరి. మా గురువుల వద్ద అధ్యయనము చేయువారికి ప్రతిక్షణము పరీక్షే.

మా శాస్త్రాధ్యయము కొనసాగుచున్న రోజులలో శాస్త్రాధ్యయనము ఎలా చేయవలెనో మా గురువులు ఒకనాడు విశదీకరించిరి. జగద్గురుశ్రీవిద్యారణ్యమహాస్వామివారు పంచదశీగ్రంథములో ముముక్షువు బ్రహ్మవిచారమెట్లు చేయవలెనో చెప్పుచు,

> తచ్చింతనం తత్కథనమన్యోన్యం తత్ప్రబోధనం ।
> ఏతదేకపరత్వం చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః ॥

అని ఒక శ్లోకమును ఉల్లేఖించిరి. ఈ శ్లోకములో "తత్" అనగా పరబ్రహ్మ. ముముక్షువు (మోక్షము కోరు వాడు) ఎల్లప్పుడు **తచ్చింతనం** - ఆ బ్రహ్మమును మాత్రమే చింతించవలెను. పరబ్రహ్మకంటె వేరు దాని తలచుట నిష్ప్రయోజనము కనుక, అట్టి పదార్థముల గూర్చి ఆలోచించకూడదు. **తత్కథనం** - బ్రహ్మమును తెలియజేయు వాక్యములనే సతతము ఉచ్చరించుచుండవలెను. **అన్యోన్యం తత్ప్రబోధనం** - వేరు జిజ్ఞాసువులతో కూడియూ పరస్పరము బ్రహ్మవిచారము చేయవలెను. పరబ్రహ్మగూర్చి తనకు తెలిసిన విషయములను మరొకరికి చెప్పుకోవలెను. తనకు తెలియని విషయములను పరులనుండి తెలుసుకొనవలెను. ఈ రీతిగా పరస్పరము బోధించుకొనుచు బ్రహ్మవిచారము నిరంతరము జరుపవలెను. **ఏతదేకపరత్వం చ**

WWW.SRINGERI.NET

- బ్రహ్మవిచారమందుమాత్రమే యత్నించుట, **బ్రహ్మాభ్యాసం** - నిజమైన బ్రహ్మవిచారము అని ప్రాజ్ఞులు చెప్పుదురు. దీనినుద్దేశించి గురువులు "ఈ లక్షణములు ముముక్షువులచేత చేయబడు బ్రహ్మాభ్యాసమునకు మాత్రమే పరిమితములు కావు. శాస్త్రపాండిత్యమును పొందగోరిన విద్యార్థి కూడా ఈ విధముగానే తర్కశాస్త్రాద్యభ్యాసము చేయవలెను. అందుచే ఈ శ్లోకమును

తచ్చింతనం తత్కథనమన్యోన్యం తత్ప్రబోధనం ।
ఏతదేకపరత్వం చ తర్కాభ్యాసం విదుర్బుధాః ॥


అని కూడ మార్చి గ్రహించవలెను. కావున నీవు అత్యంతశ్రద్ధతో ఈ న్యాయశాస్త్రమును అధ్యయనముచేయవలెను" అని సెలవిచ్చిరి.



ఎన్నెన్నో శాస్త్రీయవిచారములు ఎల్లపుడు మా గురువర్యుల జిహ్వాగ్రములో నాట్యమాడుతూంటాయి. అవినేను ముందంటే నేను ముందన్నట్లు పోటీ పడుతూ ఆయా సందర్భములలో వారి ముఖమునుండి వెలువడుతూంటాయి. శాస్త్రమందు ఎంతో కృషి చేసిన పండితులు

WWW.SRINGERI.NET

మా గురువులనుండి క్రొత్తవిషయములను గ్రహించి “మేము ఈ శాస్త్రమును ఎన్నో సంవత్సరములుగా చదువుచున్నాము, కాని నేటి వరకు ఈ క్రొత్త విషయమును మేము గమనించలేదు. శ్రీచరణులు చెప్పగా ఈ విషయమును తెలుసుకుంటిమి” అని చెప్పుచుందురు. ఇట్టి అసాధారణవైదుష్యము మా గురువులందే చూచుటకు సాధ్యము. వారు శాస్త్రము ప్రచారము చేయుటకై, మరియు శాస్త్రాధ్యయనము చేయువారిని ప్రోత్సహించుటకై, “శాస్త్రపోషకసభ"ను ప్రారంభించిరి. ఈ సభ ద్వారా, ఎంతోమంది విద్యార్థులు న్యాయ-వేదాంత-మీమాంసా-వ్యాకరణ-వేదభాష్యాదులను అధ్యయనము చేయగలిగిరి. అధ్యయనము పూర్తి చేసిన విద్యార్థులకు, జగద్గురువులే స్వయముగా మహాపరీక్షను చేసిరి. ఆ పరీక్షయందు ఉత్తీర్ణులైన వారికి “విద్వత్ప్రవర” అను



బిరుదును అనుగ్రహించిరి. ఆ విధముగా అధ్యయనముచేసిన వారు నేటికి దేశముయొక్క నలుమూలల ప్రతిష్ఠితవిద్వాంసులుగా కీర్తి గాంచుచున్నారు. “మేము శాస్త్రపోషకసభ ద్వారా అధ్యయనము చేసినాము. సాక్షాతు జగద్గురువులే మాకు పరీక్షచేయుట మా

WWW.SRINGERI.NET

భాగ్యము. అందుచే మేము జాగ్రత్తగా ఈ శాస్త్రపోషకసభద్వారా అధ్యయనము చేసినాము" అని నేటికి ఆ విద్యార్థులు చెప్పుచుందురు. ఈ విధముగా శాస్త్రపోషకసభలో చదువుట, జగద్గురువుల సమక్షములో మహాగణపతివాక్యార్థసభలో పాల్గొనుట తమ అదృష్టముగా విద్వాంసులు తలతురు.



మా గురువులకు శాస్త్రములందు అత్యంతసూక్ష్మదృష్టి కలదు. బ్రహ్మసూత్రములలో ఐదవ సూత్రము **"ఈక్షతేర్నాశబ్దం"** అని. త్రిగుణాత్మకము, స్వతంత్రము అయిన ప్రధానము (మూలప్రకృతి) జగత్కారణమను సాంఖ్యమతము ఈ సూత్రము ద్వారా నిరాకరించబడినది. ఈ సూత్రమునకు వివరణ భగవత్పాదభాష్యమందు ఇట్లు ఇవ్వబడినది - ప్రధానము అశబ్దము (వేదమందు చెప్పబడలేదు). **"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" "తదైక్షత" "తత్తేజోऽసృజత"** ఇత్యాది వేదవాక్యములందు "సత్"పదముచే చెప్పబడిన జగత్కారణము ప్రధానము కాదు. దీనికి కారణము? **"ఈక్షతేః"** అని చెప్పబడినది. ఇక్కడ ప్రధానము వేదోక్తజగత్కారణము కాదు, ఈక్షతేః అని వేదమందు చెప్పబడినది కావున. కాని ఇక్కడ పైపైన ఒక విరోధము తోచుచున్నది. ఇక్కడ హేతువుగా చెప్పబడిన ఈక్షణము(సంకల్పించుట) పక్షమైన ప్రధానమందు లేదు. ప్రధానము అచేతనము. సంకల్పరూపమైన

WWW.SRINGERI.NET

ఈక్షణము చేతనపదార్థములకే కలుగును. కావున ఈ విధముగా పక్షములో లేని హేతువును చెప్పుట సబబు కాదు కదా - అనే ప్రశ్న కలుగవచ్చు. ఇక్కడ శ్రీచరణులు ఇట్లు సమాధానము చెప్పిరి - ఇక్కడ హేతువు ఈక్షణము కాదు, ఈక్షణాభావము అని చెప్పవలెను. సూత్రమున "ఈక్షతేః న అశబ్దం" అన్న పదములలో నఞ్ ఒకటి కలదు. దానికి అభావము అర్థము. ఆ అభావమును "ఈక్షతేః" అనే పదమందు యందు ప్రకృత్యర్థమైన ఈక్షణమునకు, ప్రత్యయార్థమైన హేతువునకు మధ్యలో అన్వయించుకొనవలెను. అప్పుడు ఈక్షణాభావము హేతువగును, ఆ ఈక్షణాభావము ప్రధానమందు కలదు కావున హేతువు పక్షములోనుండు. ఈ విధముగా అచ్చటి భాష్యమునర్థము చేసుకొనవలెను. ప్రకృతిప్రత్యయములకు మధ్యలో ఇంకొక పదార్థము అన్వయించవచ్చునా అను శంక కూడదు. అట్టి వాడుకలో దోషములేదని చెప్పెడి ప్రాచీనప్రయోగములు కలవు. వ్యుత్పత్తివాదగ్రంథములో గదాధరభట్టాచార్యులు ప్రకృతిప్రత్యయార్థముల మధ్యలో నఞర్థము చేర్చవచ్చునని నిర్ణయించినారు. ఇందుకు ఉదాహరణగా **"నామూఢస్యేతరోత్పత్తేః"**, **"నానుపమృద్య ప్రాదుర్భావాత్"** మున్నగు సూత్రములుదాహరించబడినవి. **"నామూఢస్యేతరోత్పత్తేః"** అను సూత్రమున **అమూఢస్య** - మోహములేని వానికి, **ఇతరయోః** - రాగద్వేషములయొక్క **ఉత్పత్తి** - పుట్టుక లేదు కావున రాగద్వేషమోహాములను దోషములలో మోహమే మిక్కిలి అనర్థకారకమని సూత్రముయొక్క తాత్పర్యము. ఈ సూత్రమందు ప్రకృతిప్రత్యయార్థములకు మధ్యలో నఞర్థము అన్వయించుచున్నది. అదే విధముగా **"నానుపమృద్య ప్రాదుర్భావాత్"** సూత్రమునకు - బీజముయొక్క ఉపమర్దము లేక అంకురము మొలకెత్తదు అని అర్థము. ఇక్కడ కూడ నఞ్ పంచమ్యంతపదములో ప్రకృతిప్రత్యయార్థముల నడుమ అన్వయించుచున్నది. ఇట్టి ప్రయోగముండుటచేతనే గదాధరభట్టాచార్యులు వ్యుత్పత్తివాదగ్రంథమందు ప్రకృతిప్రత్యయార్థముల మధ్యలో నఞ్అర్థము అన్వయించవచ్చు అని వ్రాసియున్నారు. ఈ బ్రహ్మసూత్రమందు కూడ,

WWW.SRINGERI.NET

ప్రకృతిప్రత్యయార్థముల మధ్య నఞర్థము అన్వయించుటచే, "ఈక్షణము లేకపోవుటవలన ప్రధానము జగత్కారణముగా వేదప్రతిపాద్యము కాదు" అను అర్థము సిద్ధించుచున్నది - అని గురుచరణులు వివరించిరి. ఈ విషయమును మరి యే వ్యాఖ్యాకారుడు వ్రాయలేదు. ఇట్టి నూతనమైన సూక్ష్మవిచారములు జగద్గురువులచే పాఠసమయములో ఉపదేశించబడును.

మరొక ఉదాహరణ - న్యాయశాస్త్రములో న్యాయసిద్ధాంతముక్తావళీ గ్రంథముయొక్క వ్యాఖ్యయైన దినకరిలో హేత్వాభాసనిరూపణములో **"యద్విషయకత్వేన జ్ఞానస్యానుమితివిరోధిత్వం తత్త్వం"** అని హేత్వాభాససామాన్యలక్షణములో తృతీయార్థముగా చెప్పబడిన అవచ్ఛేదకత్వము స్వరూపసంబంధరూపమా లేద అనతిరిక్తవృత్తిత్వరూపమా అని వికల్పము చేసి, స్వరూపసంబంధరూపావచ్ఛేదకత్వనివేశపక్షములో దోషైకదేశములో అతివ్యాప్తి, దానిని వారించుటకై పర్యాప్తిని నివేశించినచో అసంభవము అను రెండు దోషములు చెప్పబడినవి. అనతిరిక్తత్వవృత్తిత్వరూపావచ్ఛేదకత్వనివేశపక్షములో "హ్రదో వహ్నిమాన్" అను స్థలములో వహ్న్యభావవిశిష్టహ్రదమునకు కేవలహ్రదమునకు "విశిష్టం శుద్ధాన్నాతిరిచ్యతే" అను నియమము ప్రకారము భేదము లేదు కావున, విశేష్యమాత్రవిషయకమైన "హ్రదః" అను నిశ్చయమందు వహ్న్యభావవిశిష్టహ్రదవిషయిత కలదు కావున, అక్కడ ప్రకృతానుమితిప్రతిబంధకత లేదు కావున, వహ్న్యభావవిశిష్టహ్రదవిషయిత ప్రకృతానుమితిప్రతిబంధకతాతిరిక్తవృత్తియై ఉండును కావున వహ్న్యభావవిశిష్టహ్రదాదిస్థలములందు అవ్యాప్తి అని చెప్పబడినది. దినకరివ్యాఖ్యానమైన రామరుద్రీయములో "అన్నిచోట్ల అప్రతిబంధకమైన విశేష్యమాత్రవిషయకనిశ్చయములో విశిష్టవిషయిత కలదు కావున, విశిష్టదోషవిషయిత ప్రతిబంధకాతిరిక్తవృత్తియే కావున ఏ స్థలమునందైన లక్షణసమన్వయము కుదరకపోవుటచే అసంభవమే

ఇందు దోషము, కావున దినకరిలో అవ్యాప్తిగా చెప్పబడిన దోషమును అసంభవమని గ్రహించవలెను" అని వ్రాయబడినది.

కాని ఇక్కడ గురువులు ఇట్లు చెప్పిరి - "అనతిరిక్తవృత్తిత్వరూపావచ్ఛేదకత్వనివేశములో అవ్యాప్తియే దోషము - అను దినకరివచనమే సరియైనది. అసంభవమనుట కుదరదు. "ఘటః అవృత్తిః" అన్నప్పుడు, ఘటవిషయిత ఎందెందు కలదో, అందందు ప్రకృతానుమితిత్వవ్యాపకప్రతిబధ్యతానిరూపితప్రతిబంధకత కలదు కావున "ఘటవత్" అనే బాధయొక్క విషయిత ప్రతిబంధకతానతిరిక్తవృత్తియే అగును. కావున ఘటవద్రూపబాధలో లక్షణసమన్వయము కుదురుచున్నది కావున అవ్యాప్తియే దోషమగును, అసంభవము కాదు. రామరుద్రీయములో అవ్యాప్తిపదమును అసంభవపరముగా వ్యాఖ్యానించుట చింత్యము". ఇక్కడ - సర్వశాస్త్రపారంగతులైన రామరుద్రభట్టాచార్యులు వారి వ్యాఖ్యానములో అతిసూక్ష్మవిచారములను చెప్పినారు. ఆ విచారములను గ్రహించి విద్యార్థులు వ్యుత్పన్నులు కాగలరు. కావునకావున రామరుద్రభట్టాచార్యులకు ఈ విషయజ్ఞానము లేది అని చెప్పుట సరికాదు. కానీ "ఘటః అవృత్తిః" అను స్థలము పరిగణణలో స్వీకరించకుండ వారు ఆ మాటను అన్నారు - అని సమర్థించవలెను - అని గురుచరణులు చెప్పినారు.

ఈ విధముగా స్వయముగా సకలశాస్త్రపారంగతులై మావంటి విద్యార్థులకు పాఠాలు చెప్పుచూ శాస్త్రపోషకసభద్వారా శాత్రవిద్యార్థులను ప్రోత్సహిస్తూ నిజమైన శాస్త్రసంరక్షణ చేస్తున్న ఏకైకవ్యక్తి మా గురువరేణ్యులు.

మా గురువర్యులకు శాస్త్రములందే కాక సంస్కృతాదిభాషాసాహిత్యమందును అకుంఠితమైన వైదుష్యము కలదు. అతిరమణీయముగా, అతిగంభీరముగా సంస్కృతభాషలో ఎన్నో భగవస్తోత్రములు విరచించిరి. వారు సంస్కృతములో

చేసెడి అనుగ్రహభాషణములందు విశిష్టపదప్రయోగములను విని పండితులుసైతము అబ్బురపడెదరు. సంస్కృతభాషానురాగులు కూడ అమితానందమును పొందుదురు.

గురువర్యులు గుర్తుంచుకొనదగిన స్వారస్యమైన శ్లోకములను సందర్భోచితముగా ఉదాహరింతురు. ఒకనాడు 2017 సంవత్సరములో శ్రీరంగక్షేత్రమున యాత్ర చేయుచున్నప్పుడు శ్రీరంగనాథుని గురించి ఒక శ్లోకమును ఉట్టంకించినారు.

> శ్రీరంగే శోభతే యస్య శ్రీరంగే శోభతే చ యః ।
> నమోహం కలయే తస్మై న మోహం కలయే తతః ॥ - అని.

**యస్య** - ఏ పరమాత్మయొక్క, **అంగే** - వక్షస్స్థలమందు, **శ్రీః** - లక్ష్మి, **శోభతే** - శోభిల్లుచున్నదో, **యశ్చ** - ఏ పరమాత్మ, **శ్రీరంగే** - శ్రీరంగమను క్షేత్రములో, **శోభతే** - విరాజిల్లుచున్నాడో, **తస్మై** - ఆ పరమాత్మకు, **అహం** - నేను, **నమః** - నమస్కారమును, **కలయే** - సమర్పించుచుంటిని, **తతః** - అందుచేత, **మోహం** - సంసారమును కలిగించెడి అవిద్యను, **న కలయే** - పొందను. భగవదనుగ్రహముచే ముక్తిని పొందెదనని యర్థము. ఈ శ్లోకమున రెండు మార్లు "శ్రీరంగే" అను పదము, "నమోహం" అను పదము ప్రయోగించబడినవి. అయితే ఒక చోట "శ్రీరంగే" అని ఒకే పదముగా తీసుకొని "శ్రీరంగక్షేత్రములో" అనే అర్థమును గ్రహించవలెను. రెండవ సారి "శ్రీః అంగే" అని విడగొట్టి "వక్షఃస్థలమున ఉన్న లక్ష్మీదేవి" అని అర్థము గ్రహించవలెను. అదే విధముగా ఒక చోట "నమః అహం" అని విడగొట్టి "నేను నమస్కరించుచున్నాను" అని, మరొక చోట "న మోహం" అని విడగొట్టి మోహమనే అవిద్యనుండు విముక్తిని పొందెదను అనే అర్థమును గ్రహించవలెను. శబ్దము ఒకే విధముగానున్నను, దానిని విడగొట్టు క్రమములో పలువిధములైన అర్థములు లభించును. ఇది సంస్కృతభాషయొక్క అద్వితీయశైలి. ఈ విధముగా ఎన్నో విషయములు సమయానుసారముగా వారి

WWW.SRINGERI.NET

ముఖారవిందమునుండి వెలువడుచుండును. పుణ్యవంతులైన వారలే గురువర్యుల ఉపదేశామృతమును మనసార ఆస్వాదించగలరు. ఇట్టి వైశిష్ట్యము మా గురువర్యులయందు స్పష్టముగా కానబడుచున్నది.

WWW.SRINGERI.NET

# పరోపకారనిరతః

అటుపిమ్మట చెప్పబడిన గురులక్షణము "పరోపకారనిరతః" అని. శాస్త్రము ధర్మాధర్మములను నిర్వచించుచు "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం" అని చెప్పినది. పరోపకారముచే పుణ్యము కలగును కావున పరోపకారమే ధర్మము. పరులను పీడించుట పాపకారణము కావున అదియే అధర్మము. ఈ ధర్మముగా చెప్పబడిన పరోపకారము బహువిధముగా ఉండును. ఎవరెవరికి ఏమేమి కావలెనో, ఆయా పదార్థములను వారికి అందించుటే పరోపకారము. ఆకలిగొన్నవారికి ఆహారము, పేదలకు ధనము, విద్యార్థులకు విద్య, మొదలైన దానముల చేయుటయే ధర్మము. ఏ పనిచే పరులకు బాధ కలుగునో, అది అపకారమనబడును. అదియే అధర్మము.

మా గురువర్యులు ఎల్లవేళల పరోపకారమే చేయుదురు. నిజమునకు - మా గురువర్యుల విషయములో - వారు పరోపకారము



WWW.SRINGERI.NET

చేయుదురనునది చిన్న మాట. వారు పరోపకారపరులనుటకంటె వారు పరానుగ్రహపరాయణులనుట యుక్తము. అనుగ్రహమందు ఉపకారము కూడ అంతర్గతమగుచున్నది గదా!

కావున సర్వదా పరానుగ్రహమును చేయువారు మా గురువర్యులు. ప్రతిరోజు ఎన్నో గ్రామములనుండి, నగరములనుండి, దేశవిదేశములనుండి అసంఖ్యాకముగా భక్తజనులు మా గురువర్యుల దర్శనార్థము విచ్చేయుదురు. వారిని

చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోర్జున ।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥

అని భగవద్గీతలో చెప్పినట్లుగా ఆర్త-జిజ్ఞాసు-అర్థార్థి-జ్ఞానులను నాలుగు విధములుగా పరిగణింపవచ్చు.

కొందరు ఋణరోగాదిపీడితులై వారి దుఃఖమును తొలగించుకొనుటకై వత్తురు. వారందరిని మా గురువర్యులు అనుగ్రహించి, దుఃఖమును తొలగించుటకు శాస్త్రోపదిష్టమైన యోగ్యోపాయమును సూచింతురు. మా గురువర్యుల కరుణాసముద్రములో మునిగిన వారికి "మా కష్టములన్నియు జగద్గురువుల పాదపద్మములను ఆశ్రయించువరకే.



WWW.SRINGERI.NET

వారి చరణారవిందములను ఆశ్రయించిన వెంటనే, తదనుగ్రహమ్ముచే మా కష్టము తప్పక తొలగును, శ్రేయస్సును పొందుదుము" అని సుదృఢవిశ్వాసము. ఈ విధముగా గురువరేణ్యులు వారి వాక్కులతో, అమోఘాశీర్వాదములచే, జనుల ఆర్తిని బాపుదురు.

దినదినము జిజ్ఞాసువులు కూడ గురుదర్శనార్థము వచ్చుచుందురు. కొంతమంది పురాణ-ధర్మశాస్త్ర-వేద-న్యాయాదిశాస్త్ర-వేదాంతాది-విషయములను తెలిసికొన కోరుదురు. గురువర్యులు యథాయోగ్యము ధర్మతత్త్వమును బ్రహ్మతత్త్వమును వారికి ఉపదేశించి, సప్రమాణముగా వారిని సమాధాన పరచి, వారి అజ్ఞానమును, సంశయములను నిర్మూలింతురు.

ఈ విధముగానే ధర్మకార్యములను చేయగోరెడి వారు గురువర్యుల సన్నిధికి వచ్చి సహాయమును, వారి అనుగ్రహమును అర్థింతురు. దేశములో ఎక్కడెక్కడయితే దేవాలయములు నిర్మింపబడునో, గోసంరక్షణ జరుగునో, వేదశాస్త్రముల ప్రచారమగునో, దీనజనోపకారము చేయబడునో, ఆయా కార్యములకు శారదాప్రసాదమును అనుగ్రహించి, వారి కటాక్షములతో, అమోఘాశీర్వాదములతో తత్తత్కార్యకర్తలను అనుగ్రహించి ప్రోత్సహింతురు. మరి కొంతమంది యే అపేక్షలేక దర్శనార్థము వచ్చుచుందురు. వారిని కూడ గురువర్యులు అనుగ్రహింతురు. ఈ విధముగా "పరోపకారనిరతః" అని చెప్పబడిన గురులక్షణము, అస్మద్గురువర్యులయందు తెల్లముగా తెలియబడుచున్నది.



WWW.SRINGERI.NET

# జపపూజాదితత్పరః

అటు పిమ్మట లక్షణము **"జపపూజాదితత్పరః"**. గురువర్యులు ప్రతిదినము నియమముగా వారి అనుష్ఠానమును, శ్రీశారదాచంద్రమౌళీశ్వరుల పూజను చేయుదురు. ప్రతిసంవత్సరము చైత్రమాసమునుండి ఫాల్గునమాసపర్యంతము శ్రీరామనవమీ-నృసింహజయంతీ-కృష్ణాష్టమీ-దేవీనవరాత్ర-శివరాత్ర్యాదిసందర్భములలో ఆయాదేవతలను సంప్రదాయానుసారముగా శాస్త్రోక్తవిధానమున అర్చింతురు. బ్రహ్మనిష్ఠులు నిష్కాములు అయిన వారు పూజలచే వ్రతములచే పొందవలసిన ఫలమేమియును లేదు. అయినను లోకసంగ్రహార్థము (లోకమును చెడుమార్గమునుండి తప్పించి సన్మార్గమందు పెట్టుటకై), లోకకల్యాణార్థము పూజాదికములను అనుష్ఠింతురు. భగవంతుడు గీతలో



WWW.SRINGERI.NET



ఇట్లు చెప్పియున్నాడు -

> యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।
> స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥ అని.

సర్వజనులలో బ్రహ్మజ్ఞాని శ్రేష్ఠునిగా లెక్కింపబడినాడు. కావున ఆతడు లోకసంగ్రహార్థము కర్మానుష్ఠానము చేయుట చూచి, అన్యులు కూడ అతడిని అనుసరించి వారి వారి విహితకర్మములను పాలింతురు. కావున - "నీవు జ్ఞానివైనచో, స్వప్రయోజనము లేకపోయినను, లోకసంగ్రహార్థము కర్మానుష్ఠానము చేయవలెను. నీవు జ్ఞానివి కానిచో, స్వప్రయోజనార్థము కర్మాచరణము చేయవలెను" అనునది శాస్త్రముల నిర్ణయము. కావున బ్రహ్మనిష్ఠులైన మా గురువర్యులకు పొందవలసినది యేది లేకపోయినను, వారు లోకసంగ్రహార్థము, లోకక్షేమార్థము, ప్రతిసంవత్సరము ఆయా పర్వదినముల సందర్భములలో పూజాదికమును నిర్వర్తించెదరు. భగవంతుడి సన్నిధిలో సర్వజనశ్రేయస్సును ప్రార్థింతురు.

WWW.SRINGERI.NET

## అమోఘవచనః

అటు పిమ్మట చెప్పబడిన గురులక్షణము **"అమోఘవచనః"**. గురువర్యుల ముఖారవిందమునుండి ఆశీర్వాదరూపముగా జాలువారు వాక్కు ఎన్నడును పొల్లుపోవదు. **"ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి"** అను పూర్వకవివాక్కు మా గురువర్యులవిషయములో చక్కగా అన్వయించునది. చాలా మంది వారు తలపెట్టిన కార్యములయందు విఘ్నములను పొందినవారై శృంగేరికి వచ్చి గురువర్యుల చెంత తత్తత్కార్యసిద్ధిని ప్రార్థింతురు. అప్పుడు గురువర్యులు వారిని మంత్రాక్షతలతో అనుగ్రహించి "ఇక మీరు చేయదలచిన కార్యము నిర్విఘ్నముగా జరుగుగాక" అని దీవింతురు. అంతట ఆయా కార్యములు ఎటువంటి అంతరాయము లేకుండ సరళముగా జరిగిపోవును. ఈ విషయము ఎంతో మంది శిష్యులకు అనుభవమందు ఉన్నది.

2012-13 సంవత్సరములో మా గురువర్యులు దీర్ఘకాలవిజయయాత్రార్థము బయలుదేరుచుండగా, మహామాత (గురుమాత) శ్రీ తంగిరాల అనంతలక్ష్మమ్మగారు వారిని దర్శించి "మీరు పదమూడు నెలలు విజయయాత్రను సంకల్పించియున్నారు. నేను వృద్ధురాలిని. నా శరీరము అతిజీర్ణమైనది. మీరు తిరిగివచ్చువరకు నేను సశరీరముగా ఉంటానో లేదో అని సందేహముగా ఉన్నది" అనినారు. అప్పుడు గురువర్యులు "మేము సంకల్పించినట్లుగా విజయయాత్రను చేసి శృంగేరికి తిరిగివచ్చెదము. అప్పుడు మీరు తప్పక మమ్ములను దర్శించెదరు. ఇందు ఎట్టి సందేహము లేదు" అని సెలవిచ్చి, యాత్రార్థము

WWW.SRINGERI.NET

వెడలిరి. అనంతలక్ష్మమ్మగారు కూడ వారి వచనమును మనసారా విశ్వసించి, అమితశ్రద్ధతో భగవద్ధ్యానము చేయుచు, యాత్రాసమాప్తికై ఎదురుచూచుచుండిరి. మా గురువర్యులు దక్షిణభారతయాత్రను ముగించి శృంగేరికి చేరుకున్నారు. అప్పుడు అనంతలక్ష్మమ్మగారు మిక్కిలి సంతోషముగా జగద్గురువుల దర్శనమును చేసుకొని, రెండు రోజుల వ్యవధిలో తమ శరీరమును వదిలి, పుణ్యలోకములను పొందెను. ఈ విధముగా **"అమోఘవచనత్వము"** మా గురువరులయందు స్పష్టముగా కానబడుచున్నది.



WWW.SRINGERI.NET

# శాంతః

అటు పిమ్మట చెప్పబడిన గురులక్షణము **"శాంతః"**. కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యములనెడి ఆరు అంతశ్శత్రువులను జయించినవాడు శాంతుడనబడును. మహాత్ములు ఆ కామక్రోధాదులను నిర్జించి, శుద్ధమనస్కులై, వారి కడగంటి చూపులచే, అమృతమువంటి మాటలచే, సర్వజనులను అనుగ్రహించెదరు. కామక్రోధముల చేతచిక్కిన మూర్ఖులు ఎన్నో అకార్యములను చేసి దుఃఖమనుభవించెదరు. కావున భగవంతుడు గీతలో ఇట్లు సెలవిచ్చినాడు -

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్ త్రయం త్యజేత్ ॥ - అని.

కామక్రోధాదులు నరకమునకు ద్వారములవంటివి. కావున ఈ అంతశ్శత్రువులు బాహ్యశత్రువులకన్నను ప్రమాదకారులు. అందుచేత ఈ ఆరు అంతశ్శత్రువులను మనమందరము తప్పక జయించాలి. మా గురువర్యులు కామక్రోధాదులను జయించినవారు. వారు శాంతమనస్కులై శిష్యులకు హితవును ఉపదేశించుచుందురు. శిష్యుల శ్రేయస్సు తప్ప వారు మరి వేరు కోరరు. వారి దర్శనార్థము ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు మొదలైన మహాజనులు కూడ విచ్చేయుచుండుదురు. వారిని గురువర్యులు ఆశీస్సులతో అనుగ్రహించుదురు కాని తమ కొరకు దేనిని కోరుకొనరు. ఒక నాడు కర్ణాటకముఖ్యమంత్రి గురువర్యులను దర్శించుకొని, కర్ణాటకరాజ్యప్రభుత్వము తరపున శ్రీమఠాభివృద్ధి కోసము పెక్కు ధనమును సమర్పించ తలచెను. కాని గురువర్యులు "శ్రీమఠమునకు

WWW.SRINGERI.NET

కావలసిన ధనమంతయు శ్రీశారదాపరమేశ్వరియొక్క అనుగ్రహముచే చేకూరును. కావున ఈ ప్రభుత్వధనమును ప్రజాసేవలో వినియోగించండి" అని ఆదేశించిరి. అత్యంతవినయశాలియైన ఆ ముఖ్యమంత్రి అట్లే చేసెను. ఈ విధముగా కామక్రోధాదిరాహిత్యమనెడి శాంతలక్షణము గురువర్యులయందు మనము స్పష్టముగా చూడగలము.



## వేదవేదాంగపారగః

అటుపై లక్షణము **"వేదవేదాంగపారగః"**. వేదములయందు వేదాంగములయందు గురువర్యులు పారంగతులు. ప్రతి సంవత్సరము శంకరజయంతిసందర్భముగా శృంగేరిలో వేదసభ జరుగుతుంది. అందు భారతదేశము నలుమూలలనుండి ఎంతోమంది వేదవిద్వాంసులు ఉత్సాహముగా పాల్గొనుచుందురు. తమ తమ స్వశాఖలను గురువర్యుల సన్నిధిలో పఠించి వారిని ఆనందింపజేయుదురు. గురువర్యులే స్వయముగా వేదభాగములను నిర్దేశింపగా, ఆయా భాగములను వేదపండితులు మహోత్సాహముతో పఠింతురు. అటువంటి సందర్భములలో గురువర్యులు సూచించిన ఆయా భాగములను వినిన వేదపండితులు "మేము పెద్దపెద్ద పరీక్షలకు వచ్చినప్పుడు ఇటువంటి



WWW.SRINGERI.NET



భాగాలను అడిగినారు. ఈ భాగములను చక్కగా చెప్పగలిగినవాడే పరీక్షలందు ఉత్తీర్ణుడగును. కావున జగద్గురువుల ముందు మాకు నేటికి కూడ పరీక్ష జరుగుచునేయుండును" అని చెప్పుకొనుచు, గురువర్యుల ముంగిట వేదమును పఠించెడి అవకాశమును వారి అదృష్టముగా భావింతురు.

మేము బ్రహ్మచారిగా ఉన్నప్పుడు నరసింహవనమందు మా పరమగురు-పరమేష్ఠిగురు-పరాపరగురువుల అధిష్ఠానమందిరమున అధ్యయనము చేయుచుండెడివారము. ప్రతిరోజు గురువర్యులు అధిష్ఠానమందిరదర్శనమునకై వచ్చుచుండెడివారు. మేము అక్కడ అధ్యయనము చేయుచు వారి దర్శనమును చేసికొనుచుండెడివారము. ఒక నాడు మందిరదర్శనార్థమై వచ్చిన గురువర్యులు నమస్కరించిన నన్ను చూచి "ఈ నాడు ఏ వారము" అని అడిగినారు. "నేడు ఆదివారము" అని చెప్పినాను. అప్పుడు వారు "ఆదివారమునాడు అరుణప్రశ్నపారాయణ ప్రశస్తము. ప్రతి ఆదివారము అరుణప్రశ్నపారాయణ చేయుచుంటివా?" అని మరల అడిగిరి. "ప్రతి ఆదివారము నియమముగా చేయుటలేదు" అని చెప్పితిని. "నేటినుండి ప్రతి ఆదివారము నీవు అరుణప్రశ్నపారాయణ

చేయాలి" అని వారు ఆదేశించిరి. అంతట నేను సాష్టాంగముగా నమస్కరించి "అటులనే చేసెదను" అని వారి యాజ్ఞను శిరసావహించగా, "ఇప్పుడే పారాయణను ప్రారంభించు. మేము ఇక్కడే కూర్చొని వినెదము" అని గురువర్యులు పలికిరి. అప్పుడు గురువర్యుల సన్నిధిలో అరుణప్రశ్నను సంపూర్ణముగా పారాయణ చేసితిని. మరుసటిరోజున మరల అధిష్ఠానదర్శనార్థము వచ్చిన గురువర్యులు "నేడు సోమవారము. సోమవారమున స్వాధ్యాయబ్రాహ్మణప్రశ్నపారాయణ చేయవలెను. కావున పారాయణ ప్రారంభించు, మేము ఇచ్చటనే కూర్చొని వినెదము" అని మమ్ము ఆదేశించిరి. మేము అటులనే స్వాధ్యాయబ్రాహ్మణపారాయణ



చేసితిమి. అందు చివరి అనువాకములలో "నమో నమశ్శిశుకుమారాయ నమః" అను మంత్రము కలదు. మేము ఆ మంత్రమును చెప్పుచుండగా, గురువర్యులు "ఈ మంత్రమున 'శిశుకుమారాయ నమః' అన్నప్పుడు చివరి నమశ్శబ్దమునకు స్వరమేమిటి? స్వరితమా, ఉదాత్తమా?" అని

WWW.SRINGERI.NET

అడిగిరి. మేము అప్పుడు వెంటనే "ఉదాత్తస్వరము" అని సమాధానము చెప్పినప్పటికి, మనస్సులో కొంత సందేహమున్నది. అధ్యయనమప్పుడు మాకు ఉదాత్తస్వరమే అభ్యాసమైనది. కాని కొంతమంది ఆ స్వరమును స్వరితస్వరముగా పలుకుటయు వింటిని. కొన్ని పుస్తకములందును అటులనే ముద్రితమైనది. కావున మేము గురువర్యులను "నేను అధ్యయనబలముతో అక్కడ ఉదాత్తస్వరమునే పలుకుచుంటిని. కాని కొన్ని పుస్తకములందు ఇక్కడ స్వరితస్వరము కనబడుచున్నది, కొంతమంది స్వరితమునే పలుకుచున్నారు. అందుచేత శిక్షానుసారముగా ఇక్కడ ఏ స్వరము సరియైనది?" అని అడిగితిమి. వెంటనే గురువర్యులు

ఆరణ్యకే తు వాక్యాంతే ఉదాత్తో నమ ఉచ్యతే ।
నోపతే-వై-మహో-జాయ-సేభ్యః పూర్వో విగాః క్రమాత్ ॥

అని ఆరణ్యకశిక్షలోని ఒక శ్లోకమును ఉదాహరించిరి. తైత్తిరీయారణ్యకములో కొన్ని చోటులను మినహాయించి, వాక్యాంతములో వచ్చెడి నమశ్శబ్దములన్నిటికి ఉదాత్తస్వరమే పఠించవలెను. మినహాయింపులు **"నోపతే-వై-మహో-జాయ-సేభ్యః పూర్వో విగాః క్రమాత్"** అని శ్లోకమందు చెప్పబడినవి. **"ఉపతే నమః"** అన్నప్పుడు నమశ్శబ్దమునకు స్వరితము చెప్పవలెను. వై - **"విశ్వరూపాయ వై నమో నమః"** అన్నప్పుడు, మహో - **"మహో నమో నమః"** అన్నప్పుడు, జాయ - **"మహారాజాయ నమః"** అన్నప్పుడు, సే - **"సుతరసి తరసే నమః"** అన్నప్పుడు, నమశ్శబ్దమునకు చివర స్వరితము చెప్పవలెను. **విగాః** - మంత్రబ్రాహ్మణప్రశ్నమందు **"విగా ఇంద్ర విచరన్త్స్పాశయస్వ"** అను అనువాకమందు **"సకృత్తే అగ్నే నమః ।** ద్విస్తే నమః । త్రిస్తే

WWW.SRINGERI.NET

నమః । చతుస్తే నమః । పంచకృత్వస్తే నమః । దశకృత్వస్తే నమః । శతకృత్వస్తే నమః । ఆసహస్రకృత్వస్తే నమః । అపరిమితకృత్వస్తే నమః ।" అను వాక్యములయందున్న నమశ్శబ్దములను స్వరితస్వరముతోనే పలుకవలెను. మరొక్క చోట ఆరణ్యకమున "నిధనపతయే నమః", "మనోన్మనాయ నమః" మున్నగు తావులలో నమశ్శబ్దమును ఉదాత్తస్వరముతోనే పలుకవలెనని ఈ శ్లోకముయొక్క తాత్పర్యము - అని గురువర్యులు వివరించిరి. నాకు అచ్చటి స్వరమందు గల సంశయము తొలగిపోయినది. అంతవరకు అలవాటుచే ఆరణ్యకమందు ఆయా మంత్రములలో ఉదాత్తస్వరితములను పలుకుచున్నప్పటికి, గురువర్యుల ఉపదేశముచే ఆ స్వరముల విషయమందు స్పష్టత లభించినది.

ఒక రాత్రి చంద్రమౌళీశ్వరపూజలో మేము తైత్తిరీయసంహితయొక్క ద్వితీయకాండలో పంచమప్రశ్నమైన "ఏష వై దేవరథో యద్దర్శపూర్ణమాసౌ" అనే అనువాకమునకు క్రమపాఠమును పఠించితిమి. మరుసటిరోజు దర్శనసమయములో గురువర్యులు "నిన్న నీవు 'ఏష వై దేవరథః' అనే అనువాకముయొక్క క్రమపాఠము చేసితివి కదా. ఆ అనువాకములో 'దర్శపూర్ణమాసౌ' అనే పదము ఎన్ని సార్లు వచ్చినది?" అని నన్ను అడిగిరి. నేను ఆ అనువాకమందు ఆ పదమెన్ని మార్లు వచ్చునో ఒక్క సారి కూడ ఆలోచించలేదు. వెంటనే లెక్కపెట్టుట ప్రారంభించితిని. అప్పుడు గురువర్యులు "ఇప్పుడు లెక్కపెట్టకు, చాలా సమయము కావలయును. "దర్శపూర్ణమాసౌ" అను పదము పంతొమ్మిది మార్లు వచ్చును. ఇప్పుడు నువ్వు గదికి వెళ్ళి లెక్కపెట్టుకొనవచ్చును" అని చెప్పిరి. అప్పుడు నేను గదికి వెళ్ళి లెక్కపెట్టగా, పంతొమ్మిది మార్లే "దర్శపూర్ణమాసౌ" అను శబ్దము ఆవృత్తమైనది. ఈ విధముగా వేదములో ఏ యాగము ఏ ప్రశ్నలో ఉన్నదో, దాని యాజ్యాపురోనువాక్యములు


WWW.SRINGERI.NET

ఎక్కడెక్కడ వచ్చునో, ఇత్యాది విషయములలో గురువర్యులకు అపారమైన పాండిత్యము కలదు. అదే విధముగా వేదభాష్యములోని ఎన్నో విషయములను వారు సూక్ష్మదృష్టితో విచారింతురు. కావున గురువర్యులకు వేదమందు, వేదభాష్యమందు, వేదాంగములందు ఎంతో పాండిత్యము కలదు. అందుకు **“వేదవేదాంగపారగః”** అను లక్షణము గురువర్యులందే చూచుటకు సాధ్యము.

WWW.SRINGERI.NET

## యోగమార్గానుసంధాయీ

అటుపై **"యోగమార్గానుసంధాయీ"** అను లక్షణము చెప్పబడినది. అష్టాంగయోగమును అనుష్ఠించువారని అర్థము. యోగసిద్ధులైన గురువర్యులు వారి యోగశక్తిద్వారా దూరమునందున్ననూ శిష్యుల



WWW.SRINGERI.NET

మనస్సును తెలిసి వారి ప్రార్థనను మన్నింతురు.

ప్రతిసంవత్సరము శ్రావణకార్తికమాసముల సోమవారములయందు మధ్యాహ్నకాలములో గురువర్యులు చంద్రమౌళీశ్వరుడిని విశేషముగా పూజించెదరు. మేము బ్రహ్మచారిగా ఉన్నప్పుడు, ఒకానొక సోమవారమున పూజకు వెళ్ళుటకు శరీరమున స్వస్థత లేకుండెను. అప్పుడు ఆరోగ్యము అనుకూలముగా లేక పూజకు ఎలా వెళ్ళగలనను చింతలో మునిగితిని. ఇంకొక అరగంటలో పూజ మొదలుకానున్నది. నేను నా గదిలో కొంత కలవరపాటుతో కూర్చొని కన్నులు మూసుకొని గురువర్యుల పాదపద్మములను ధ్యానించితిని. కొంత సమయము తరువాత నాకు ఒక దృశ్యము సాక్షాత్కరించినది. గురువర్యులు చంద్రమౌళీశ్వరపూజను చేయుచుండిరి. వారు నన్ను చూచి "చింతించకు. వెంటనే బయలుదేరి పూజకు రమ్ము" అని పలికిరి. అటుపై నేను కన్నులు తెరిచి చూడగా, నా శరీరములో అంత వరకు ఉన్న అస్వస్థత నామమాత్రముగానైన లేకుండెను. ఎటువంటి ఇబ్బంది లేదు. వెంటనే త్వరపడి చంద్రమౌళీశ్వరపూజకు వెళ్ళగా, గురువర్యులచే పూజ అప్పుడే ప్రారంభమయ్యెను. ఆ రోజు యథాపూర్వముగా పూజను తిలకించి, గురువర్యుల అనుగ్రహముచే కృతార్థుడనైతిని.

ఈ విధముగా శిష్యులు వేరే చోటనున్నప్పటికి, అమితశ్రద్ధతో వాళ్ళు చేయు ప్రార్థనలను గురువర్యులు అంగీకరించి అనుగ్రహింతురు - అను విషయము పలువురిచే పలుతావులలో పరిపరివిధములుగా ప్రత్యక్షముగా అనుభవింపబడినది. ఇట్టి శక్తి గురువర్యులకు కలదు. కావుననే వారు యోగయోగశాస్త్రనిష్ణాతులు.

WWW.SRINGERI.NET

## దేవతాహృదయంగమః

అటుపై శాస్త్రములో చెప్పబడిన లక్షణము **"దేవతాహృదయంగమః"** అని. సద్గురువు దేవతలకూ ఆదరపాత్రమై ఉండును. లోకమందు ఒకడు దేవతల విషయములో తెలిసో తెలియకో అపరాధము చేసినచో, దేవతలు ఆగ్రహింతురు. అప్పుడు ఆ వ్యక్తి తన తప్పు



WWW.SRINGERI.NET

తెలిసికొన్న పిమ్మట, పశ్చాత్తాపముతో దేవతల ఆగ్రహమునుండి తనను తాను రక్షించుకొనుటకై ప్రయత్నించును. అప్పుడు ఆ మనిషి యే దేవతలపట్లు అపచారము చేసినాడో, యే దేవతలు అతనిపై ఆగ్రహించినారో, ఆ దేవతలను ఆశ్రయించవలెను. కాని దేవతలు సులభముగా సాక్షాత్కరించరు. మరి దేవతలను క్షమించమని ప్రార్థించుటెట్లు? దేవతలను ప్రసన్నులుగా చేసికొనుట ఎట్లు? అప్పుడు పై చెప్పిన సర్వలక్షణములు కలిగిన సద్గురువును ఆశ్రయించవలెను. సకలశాస్త్రములను తెలిసిన సద్గురువు శిష్యుని అపరాధమునుబట్టి దేవతాక్రోధము ఉపశమించుటకు ఉపాయమును ఉపదేశించి అనుగ్రహించును. తదుపదేశానుసారముగా శ్రద్ధతో కర్తవ్యమును అనుష్ఠించు శిష్యుడు దేవతల ఆగ్రహమునుండి ముక్తుడై దేవతానుగ్రహమునకు పాత్రమగును. ఈ విధముగా గురువు శిష్యుని రక్షించును. అందుచేతనే పూర్వీకులు "దైవే రుష్టే గురుస్త్రాతా" అని అనిరి. కావున సద్గురువు దేవతల మనస్సుకు ఎంతో దగ్గరైన వాడు. కాని అట్టి గురువుపట్ల శిష్యుడెన్నడును అపరాధము చేయకూడదు. దేవతలు ఆగ్రహించినచో గురువు రక్షించును. గురువు ఆగ్రహించినచో ముల్లోకములలో రక్షకుడు లభించడు. దానినే **"గురౌ రుష్టే న కశ్చన"** అని పూర్వజులు చెప్పిరి. కావున ఎంతో శ్రద్ధాభక్తులతో శిష్యుడు గురుసేవ చేయవలెను. గురువునకు క్రోధమును కలిగింపక ప్రవర్తించవలెను.

ఈ విధముగా శాస్త్రోక్తమైన సర్వసులక్షణములు నిండుగా కలిగిన వారు, సర్వశాస్త్రపారంగతులు, బ్రహ్మనిష్ఠులైన మా గురువర్యులు సర్వజనులను అనుగ్రహించుచున్నారు. వారి అనంతగుణసంపదను దిఙ్మాత్రముగా పేర్కొంటిమి. వారి గుణగణములను పూర్తిగా వర్ణించుటకు వెయ్యిపుటములైన సరిపోవని తలచుచున్నాము.

ఈ ప్లవనామసంవత్సరమున చైత్రశుక్లషష్ఠినాడు వారి డెబ్బదియొకటవ వర్ధంత్యుత్సవము అతివైభవముగా అనుష్ఠించబడినది. ఇచ్చట వైభవమేమనగా - ఈ సందర్భమున శాస్త్రోక్తవిధానమున

లోకకల్యాణార్థము, భగవత్ప్రీత్యర్థము, ఎన్నో పూజాజపాదికార్యక్రమముల అనుష్ఠానమే కాని, ఇంద్రియభోగములకై ధనమును వ్యర్థ పరచుట కాదు. సర్వసంగపరిత్యాగులు, వైరాగ్యనిధులు, తమ దేహమందైన మమకారము లేని గురువర్యులు నిష్కాములైనప్పటికి, లోకక్షేమార్థము కావున ఇట్టి వైభవముతో శిష్యులు ధార్మికకార్యక్రమములను జరుపుటకు ఆమోదించిరి. కావున ఈ సందర్భమందు అయుతచండీమహాయాగ-అతిరుద్రమహాయాగ-శ్రీశారదాకోటికుంకుమార్చనాది ఎన్నో కార్యక్రమములు శాస్త్రోక్తవిధానమున శృంగేరిలో జరుపబడినవి. వేదపురాణేతిహాససాహిత్యాదులలో నిష్ణాతులైన డెబ్బది పండితులకు "శ్రీభారతీతీర్థపురస్కారము" ఇవ్వబడినది. దీనజనులకు ఉపకారార్థము ఎన్నో కార్యక్రమములు చేయబడినవి.

ఇక్కడ మరొక్క విశేషమేమన - మహాత్ములైన మా గురువర్యులు వసంతమువంటివారు. వసంతకాలము తన ప్రయోజనమును తలపక, సర్వప్రాణులకు హితమును చేయునది. మహాత్ములు ఆ విధముగానే స్వప్రయోజనమును అపేక్షించక సర్వజనోపకారమును చేయుచుండుదురు. కావుననే భగవత్పాదులు -

శాంతా మహాంతో నివసంతి సంతః
వసంతవల్లోకహితం చరంతః ।
తీర్ణాస్స్వయం భీమభవార్ణవం జనా-
నహేతునాన్యానపి తారయంతః ॥

అని చెప్పిరి.

వసంతఋతువువంటి మా గురువర్యుల ఈ వర్ధంత్యుత్సవము సకలజనానందకరమైన వసంతఋతువున జరుగుటచే, వసంతఋతువు, తత్సదృశమైన గురుకరుణ - ఈ రెండిటిని మనము ఈ సందర్భమున

అనుభవించగలము. కావున ఈ వర్ధంత్యుత్సవమునకు గొప్ప వైశిష్ట్యము కలదు.

ఈ సందర్భమున అనంతశ్రీవిభూషితులైన మా గురువరేణ్యుల పాదపద్మములవద్ద సభక్తిశ్రద్ధముగా ప్రణామములను సమర్పించి, వారి పరమానుగ్రహముతో ఆస్తికమహాజనులెల్లరు సకలశ్రేయస్సులతో అభివృద్ధి కాంచెదరుగాకయని, ఈతిబాధలు తొలగుగాకయని, సనాతనధర్మము వర్ధిల్లుగాకయని ప్రార్థించుచుంటిమి.

WWW.SRINGERI.NET

# గురువర్యదశశ్లోకీ

## జగద్గురు శ్రీవిధుశేఖరభారతీ మహాస్వామిభిః విరచితా

దక్షిణామ్నాయశృంగేరీశారదాపీఠభూషణం ।
నమామి భారతీతీర్థం దక్షిణాస్యనవాకృతిం ॥1॥

కరుణారసనిష్యందిసరసాపాంగవీక్షణం ।
కటాక్షపాతనిర్ధూతపాపౌఘం కలయే గురుం ॥2॥

దిగ్వ్యారణసుహృత్కీర్తిరాజితం సంగవర్జితం ।
కామాదిద్విపపంచాస్యం భజే భర్గార్చనోత్సుకం ॥3॥

మాధవోమాధవాభేదధిషణం భిషజం కలేః ।
ప్రజ్ఞానిధిం నమస్యామి గూఢతత్త్వావబోధకం ॥4॥

శమాదిసుగుణస్తోమభూషితం యమినాం వరం ।
యోగమార్గరతం నౌమి యోగక్షేమకృతం సదా ॥5॥

విద్యాం విజ్ఞావలిర్వక్తి విమలాం యం వపుష్మతీం ।
విభూత్యై వచసాం వందే వినీతో విశ్వవందితం ॥6॥

WWW.SRINGERI.NET

శ్రుతిస్మృతిసదాచారపరిత్రాణవిధౌ భువి ।
ప్రభూతాం ప్రభుతాం ధత్తే యస్తం సంస్తౌమి సంతతం ॥7॥

యద్వాగ్ఝరీ సుపర్వాధ్వతరంగిణ్యవధీరిణీ ।
సంచారపూతధరణిః పాత్వాచార్యశిరోమణిః ॥8॥

అనంతోఽపి హృదాకాశే దహరే భాసతేతరాం ।
ఈడే శ్రుతిశిరోవేద్యం పరిపూర్ణం గురూద్వహం ॥9॥

రాజాధిరాజసంసేవ్యం రాజవిద్యాగురుం శ్రయే ।
శిష్యాలివంద్యపాదాబ్జం భారతీతీర్థదేశికం ॥10॥

WWW.SRINGERI.NET